# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 27 పేజీలు : 08, వెల రూ. 5రూ/ ఆదివారం - 19 - జనవరి- 2025


## 30 ఏళ్లుగా ఈ దుర్మార్గులు నన్ను వేధిస్తున్నారు



- నాపై సోషల్ మీడియాలో వేధింపులు.. బాబుకు బాధ్యత లేదా?
- గత 30 ఏండ్లుగా ఈ దుర్మార్గులు తనను వేధిస్తున్నారని దివంగత ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి అన్నారు.
- తన పై మీకు ఎందుకు కక్ష ఎందుకని, తానే తప్పు చేశానని ఏపీ సీఎం చంద్రబాబును ఉద్దేశించి అన్నారు.

హైదరాబాద్: గత 30 ఏండ్లుగా ఈ దుర్మార్గులు తనను వేధిస్తున్నారని దివంగత ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి అన్నారు. తన పై మీకు ఎందుకు కక్ష ఎందుకని, తానే తప్పు చేశానని ఏపీ సీఎం చంద్రబాబును మిగతా 2లో

## ఎన్టీఆర్‌కు భారతరత్న వస్తుందని ఆశిస్తున్నాం

**తెలంగాణలో 1.60 లక్షల మంది సభ్యత్వాలు తీసుకున్నారు**

- తెలంగాణలో పార్టీ పునర్నిర్మాణంపై చర్చిస్తున్నామన్న లోకేశ్
- ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ , నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించారు.
- నాయకుడిగా, సీఎంగా ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు.
- నాడు ఎన్టీఆర్ ప్రభంజనం సృష్టించి తెదేపాను అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు.
- అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు.
- తెదేపాలో కోటి మంది సభ్యత్వాలు తీసుకోవడం గర్వకారణమన్నారు.
- తెలంగాణలో తెలుగుదేశం పార్టీని పునర్నిర్మించడంపై చర్చిస్తున్నామని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. త్వరలోనే పార్టీ కార్యక్రమాలను ప్రారంభిస్తామని తెలిపారు.
- త్వరలోనే పార్టీ కార్యక్రమాలను ప్రారంభిస్తామని వెల్లడి
- తెలంగాణలో 1.60 లక్షల మంది సభ్యత్వాలు తీసుకున్నారన్న లోకేశ్






హైదరాబాద్: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ , నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించారు. నాయకుడిగా, సీఎంగా ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు.అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. నాడు ఎన్టీఆర్ ప్రభంజనం సృష్టించి తెదేపాను అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు. తెదేపాలో కోటి మంది సభ్యత్వాలు

## అమిత్ షా కు ఆంధ్రాలో పర్యటించే హక్కు లేదు

కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా శనివారం ఏపీలో పర్యటిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేయగా అమిత్ షా పర్యటనను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు నిరసనలు తెలపాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా ఆంధ్రలో అడుగుపెట్టే అర్హత లేదని ట్విటర్‌లో ఆరోపించారు.



అమరావతి : కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా శనివారం ఏపీలో పర్యట ిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేయగా అమిత్ షా పర్యటనను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు నిరసనలు తెలపాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమా నించిన అమిత్ షా ఆంధ్రలో అడుగుపెట్టే అర్హత లేదని ట్విటర్‌లో ఆరోపించారు. అమిత్ షా పర్యటనను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మిగతా 2లో

## నా జీవితం టీడీపీకే అంకితం



- ఎన్టీఆర్ సామాన్య కుటుంబంలో పుట్టి అంచలం చెలుగా ఎదిగారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.
- ఎన్టీఆర్ సినీ రాజకీయ రంగంలో మకుటం లేని మహారాజుల ఎదిగారని తెలిపారు.
- పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లో ఎన్టీఆర్ అధికారంలోకి తీసుకు రాగలిగారని.. బీసీలకు రాజకీయ అవకాశం కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు.

అమరావతి : ఎన్టీఆర్ సామాన్య కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగారని మిగతా 2లో

## భారత్‌ను విశ్వగురువుగా నిలబెడతాం

**ఢిల్లీలో కాంగ్రెస్‌కు దిక్కులేదు: కిషన్‌రెడ్డి**

- ఢిల్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.
- 'కాంగ్రెస్‌కు ఢిల్లీలో దిక్కు లేదు.. ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు.
- కాంగ్రెస్‌కు ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు కూడా మద్దతివ్వడం లేదు.



హైదరాబాద్: ఢిల్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల అంశంపై మీడియాతో మాట్లాడారు.'కాంగ్రెస్‌కు ఢిల్లీలో దిక్కు లేదు..ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు. మిగతా 2లో

## సినిమాల్లోనే కాదు రాజకీయాల్లోనూ ఎన్టీఆర్‌కు ఎన్నో రికార్డ్స్

- స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా టీడీపీ నేతలు, అభిమానులు నివాళులు అర్పిస్తున్నారు.
- విజయవాడ పటమట సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఎంపీ కేశినేని శివనాథ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్) పూలమాల వేసి నివాళులు అర్పించారు.



అమరావతి,: స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా టీడీపీ నేతలు, అభిమానులు నివాళులు అర్పిస్తున్నారు. విజయవాడ పటమట సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఎంపీ కేశినేని శివనాథ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్) పూలమాల వేసి నివాళులు అర్పించారు. మిగతా 2లో

## నీటి వాటాల్లో అన్యాయం.. బీఆర్ఎస్ వైఫల్యమే!



- గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే పదేళ్లుగా కృష్ణా జలాల పంపకాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సాగునీటి శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు.
- న్యాయమైన నీటి వాటా దక్కించుకోవడంలో బీఆర్ఎస్ సర్కారు ఘోరంగా విఫలమైందని ఆరోపించారు.

హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే పదేళ్లుగా కృష్ణా జలాల పంపకాల్లో తెలంగాణకు మిగతా 2లో

## సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా ఖర్చు చేయండి

- సబ్‌ప్లాన్ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఎస్సీ, ఎస్టీ రైతుల ఆదాయాలు పెంచాలి
- పట్టణాల్లో ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి కల్పించాలి
- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలులో భాగంగా ప్రభుత్వ శాఖలకు కేటాయించిన నిధులను నూరు శాతం ఖర్చు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.
- సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుపై ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.
- కేటగిరీలవారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం ప్రభుత్వ శాఖలకు కేటాయించిన నిధులు, చేసిన ఖర్చు వివరాలను ప్రతి నెలా వెల్లడించాలని స్పష్టం చేశారు.



హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలులో భాగంగా ప్రభుత్వ శాఖలకు కేటాయించిన నిధులను నూరు శాతం ఖర్చు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మిగతా 2లో

## రెచ్చగొట్టే మాటలు నమ్మవద్దు



- విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరుగుతోందని అందులో భాగంగానే కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చడానికి ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు.

సికింద్రాబాద్: విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌కు మిగతా 2లో

## సానుకూల ధోరణిలో భారత్-అమెరికా సంబంధాలు

భారత్, అమెరికా ల మధ్య సంబంధాలు సానుకూల ధోరణిలో ఉన్నాయని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. స్పేస్‌ఎక్స్ స్టార్‌బేస్ స్థావరంలో భారత్‌కు చెందిన వ్యాపారవేత్తలతో మస్క్ సమావేశమయ్యారు.



లండన్: భారత్, అమెరికా ల మధ్య సంబంధాలు సానుకూల ధోరణిలో ఉన్నాయని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. స్పేస్‌ఎక్స్ స్టార్‌బేస్ స్థావరంలో మిగతా 2లో

## అమెరికన్లకు 'ట్రంప్ సుంకాలు, పన్నుల దెబ్బ' తప్పదు

భరించలేని స్థాయిలో టారిఫ్‌లు విధిస్తానని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరిస్తున్న నేపథ్యంలో కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ స్పందించారు.



భరించలేని స్థాయిలో టారిఫ్‌లు విధిస్తానని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరిస్తున్న నేపథ్యంలో కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ స్పందించారు.ట్రంప్ సుంకాలు పెంచితే అమెరికన్లకు కూడా 'ట్రంప్ సుంకాలు, పన్నుల దెబ్బ' మిగతా 2లో

## కదిరి పట్టణంలో ఘనంగా శ్రీ కృష్ణ దేవరాయల జయంతి వేడుకలు



కదిరి పట్టణం దేశభాషలెందు తెలుగు లెస్స అని తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచం నలుమూలల చాటి చెప్పిన బహుముఖ ప్రజ్ఞాశాలి , ఎన్నో దుర్భేద్యమైన కోటలను , హిందూధర్మ పరిరక్షణ కోసం సైన్స్ సైతం అంతు చిక్కని గొప్ప గొప్ప దేవాలయాలను నిర్మించిన చక్రవర్తి , దక్షిణ భారతదేశంలో ఎన్నో చెరువులను , కుంటలను తవ్వించి సాగు త్రాగు నీరు అందించిన అపర భగీరథుడు విజయ నగర సామ్రాజ్య రారాజు శ్రీ కృష్ణ దేవరాయల జయంతి సందర్భంగా ఆయన ఘనకీర్తి గురించి స్మరిస్తూ రాయల్ పీపుల్స్ ఫ్రంట్ మరియు కదిరి బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. కులాలకు ,మతాలకు అతీతంగా ఒక సుభిక్షమైన పరిపాలన అందించిన గొప్ప చక్రవర్తి అటువంటి మహనీయుని చరిత్రని భవిష్యత్ తరాలకు తెలిపే విధంగా పాఠ్య పుస్తకాలల్లో ముద్రించి , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీ కృష్ణ దేవరాయల జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ మరియు బలిజ , కాపు , తెలగ, ఒంటరి , మున్నూరుకాపు సంఘాల తరపున ఈ ప్రభుత్వానికి, రాజకీయ నాయకులకు , రాజకీయ పార్టీలకు తెలియజేస్తున్నామని కుల సంఘాల నాయకులు తెలియజేశారు.” ఈ కార్యక్రమంలో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ , కాపు నాడు , కదిరి పట్టణ బలిజ సంఘం,శ్రీ కృష్ణ దేవరాయల బలిజ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఖాద్రి లక్ష్మి నరసింహ స్వామి హుండీ లెక్కింపు



కదిరి పట్టణం : శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము, కదిరి కి సంబందించిన హుండిల లెక్కింపు కార్యక్రమము 17.01.2025 వతేది శుక్రవారము లెక్కింపు పూర్తి అయినందున నగదుగా రు.82,14,097/-లు మొత్తము 58 రోజులు వచ్చినది. బంగారు 8 గ్రాములు, వెండి 406 గ్రాములు కలదు. విదేశి కరెన్సీ యుఎస్ ఎ డాలర్(అమెరికా):: 60 డాలర్స్ సిఎఎన్ఎడిఎ డాలర్స్ 10 హుండీల లెక్కింపు కార్యక్రమము ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి అధ్వర్యములో లెక్కింపు చేపట్టడమైనది. హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారిగా శ్రీ.యన్.ప్రసాద్, తనిఖీఅధికారి, దేవాదాయశాఖ, హిందూపురము డివిజన్ వారు హాజరు అయినారు. హుండి లెక్కింపు కార్యక్రమములో దేవస్థానము సిబ్బంది మరియు ఎ.పి.జి.బ్యాంకు, యం.జి.రోడ్డు శాఖ, కదిరి మేనేజర్ శ్రీ.సి.బి.చలపతి మరియు బ్యాంకు సిబ్బందితో పాటు వివిధ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



## విజయభాస్కర్ రెడ్డి ని సన్మానించిన హ్యూమన్ రైట్స్ చైర్మన్ తనకంటి వేణుగోపాల్ రెడ్డి



తనకల్లు : తనకల్లు బైక్ విజయభాస్కర్ రెడ్డి .వైఎస్ ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఏపీ తెలంగాణ స్టేట్స్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అఫ్ ఇండియా విజిలెన్స్ చైర్మన్ తనకంటి వేణుగోపాల్ రెడ్డి నేడు ఆయన నివాసానికి వెళ్లి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ చైర్మన్ తనకంటి వేణుగోపాల్ రెడ్డి. మాట్లాడుతూ విజయభాస్కర్ రెడ్డి . పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డారని, పార్టీ అధికారం లో ఉన్నప్పుడే కాదు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని వారి సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిందని కొనియాడారు. విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తనను మండల కన్వీనర్ స్థాయి నుండి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిమల్లప్ప,ఎల్ ఐసీ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లదే హవ్వ

### మండలంలో ఎక్కడ తిరగని రేషన్ పంపిణీ వాహనాలు

### నెలనెలా ప్రభుత్వం నుంచి వేతనాలు మంజూరు




వేంపల్లి : వేంపల్లె మండల వ్యాప్తంగా ప్రజా పంపిణీ నడుపుతున్న రేషన్ డీలర్ల హవ్వ నడుస్తున్నది. గత వైసిపి ప్రభుత్వం ప్రతి ఇంటికి ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో ఇంటింటికి వాహనాల ద్వారా రేషన్ పంపిణీ జరిగేది. మండల వ్యాప్తంగా 31 మంది రేషన్ షాపులు ఉండగా అందులో దాదాపు 20 వేల కుటుంబాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ డీలర్లు వాహనాలు ద్వారా ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా చక్రం తిప్పుతున్నారు. 10 కిలోలకు ఎన్నిమిదిన్నర కిలోలు మాత్రమే బియ్యాన్ని ఇస్తూ తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎన్ డి యూ అపరేటర్లు మాత్రం పంపిణీ చేస్తామని చెప్పుతున్న డీలర్లు మాత్రం మీరు వాహనాలను ఇంటి వద్దనే పెట్టుకొండి పై అధికారులతో మేము మాట్లాడు కొంటామని చెప్పుతున్నట్లు సమాచారం. ప్రతి నెల వేతనాలు అందుతాయాని డీలర్లు చెప్పడంతో వారు కూడ వాహనాలను తమ ఇంటి వద్దే పెట్టుకొని ఇతర పనులు చేసుకొంటున్నారు. ఈ విషయంపై తాహసిల్దారు హరినాథ్ రెడ్డిని వివరణ కోరగా ఎండియూ అపరేటర్లుకు ప్రతి నెల రూ 21 వేలు వేతనం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. అందులో రూ 3 వేలు వాహనం కంతు కోసం కటింగ్ పోను రూ 18 వేలు ఎండియూ అపరేటర్లు ఆకౌంట్ లో జమ అవుతున్నట్లు చెప్పారు.

## ఫైర్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శివరామిరెడ్డి



- వేంపల్లె : వేంపల్లె అగ్నిమాపక అధికారిగా శివరామిరెడ్డి బాధ్యతలను స్వీకరించారు. సత్యసాయి జిల్లా ధర్మవరం ఫైర్ స్టేషన్ లో పని చేస్తున్న శివరామిరెడ్డి పదోన్నతి మీద వేంపల్లె అగ్నిమాపక కేంద్రానికి బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అగ్నిమాపక అధికారిగా బాధ్యతలు స్వీకరించి వేంపల్లె ప్రాంత పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే అగ్ని మాపకం అధికారిగా బాధ్యతలను శివరామిరెడ్డి స్వీకరించడంతో సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. వేంపల్లె మండలంలోని ఆయా గ్రామాల్లో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరిగిన ప్రజలు సకాలంలో సమాచారం ఇవ్వాలని కోరారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

## సమయ పాలన తప్పని సరి

### -ఎంపీడీవో కుళ్లాయి స్వామి



కూడేరు : సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని ఎంపీడీవో కుళ్లాయి స్వామి సూచించారు. శుక్రవారం ఆయన కూడేరు మండల పరిధిలోని కమ్మూరు గొటుకూరు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుకు సంబంధించి రిజిస్టర్ పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని ఆదేశించారు .ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తెలియజేశారు. ప్రజలకు ఏ ఏ సేవలందిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డి రాధాకృష్ణ పాల్గొన్నారు.

# గర్భం నుంచే కాపాడుకుందాం

### డాక్టర్ ఏ. మహేష్

### కన్సల్టెంట్ పిల్లల వైద్య నిపుణులు

### కిమ్స్ సవీరా, అనంతపురం



అనంతపురం, :పుట్టుకతో వచ్చే లోపాలు అనేవి పుట్టుక సమయంలోనే ఉండే లోపాలు లేదా రుగ్మతలు. ఇవి గర్భధారణలో ఏదైనా దశలో సంభవించవచ్చు. సాధారణంగా, గర్భధారణ ప్రారంభ మూడు నెలల్లో, బిడ్డ అవయవాలు ఏర్పడే సమయంలో ఎక్కువగా జన్మ లోపాలు వస్తాయి. ఇవి శరీరంలోని ఏ భాగానికైనా ప్రభావం చూపవచ్చు మరియు రోగి, కుటుంబం, సమాజంపై జీవితాంతం ఆరోగ్య సమస్యలను కలిగించవచ్చు. భారతదేశంలో ప్రతి ఏడాది సుమారు 1-3% శిశువులు జన్మ లోపాలతో పుట్టడం వల్ల సుమారు 2.7 కోట్ల శిశువులకు ఈ సమస్య తలెత్తుతోంది. ప్రతి సంవత్సరం జనవరి నెలలో పుట్టుకతో వచ్చే లోపాల అవగాహన నెల జరుపుకుంటారు. దీని ఉద్దేశం పుట్టుకతో వచ్చే లోపాల గురించి అవగాహన పెంచడం మరియు పుట్టుక లోపాలతో పుట్టిన పిల్లల జీవితాలను మెరుగుపరిచే ప్రయత్నాలను ప్రోత్సహించడం. ఈ సంవత్సరానికి థీమ్: “మీ కోసం ఉత్తమం, మీ బిడ్డ కోసం ఉత్తమం” ప్రతీ తల్లి గర్భధారణ సమయంలో నిరంతరం వైద్యుడిని సంప్రదించి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. చాలా పుట్టుకతో వచ్చే లోపాలను గర్భధారణ సమయంలో గుర్తించవచ్చు. గర్భధారణ మొదటి మరియు రెండవ త్రైమాసికాల్లో చేసే స్క్రీనింగ్ పరీక్షలు లేదా అల్ట్రాసౌండ్ స్కాన్లు లోపాలను ముందుగా గుర్తించడంలో సహాయపడతాయి. నివారణనే చికిత్స కంటే మెరుగైనది అని మనందరికీ తెలిసిందే. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా జన్మ లోపాల వచ్చే అవకాశాలను తగ్గించవచ్చు. అందరూ ఆరోగ్యవంతమైన శిశువును కలిగి ఉండే అవకాశాలను పెంచుకోవడానికి ఈ చిన్న చిట్కాలను అనుసరించండి.

పుట్టకతో వచ్చే లోపాలను నివారించేందుకు 6 ముఖ్య సూచనలు:

విటమిన్లు, ఫోలిక్ యాసిడ్ తీసుకోండి:

బి-కాంప్లెక్స్ విటమిన్లు కొత్త కణాలను తయారు చేయడానికి అవసరం. ముఖ్యంగా ఫోలిక్ యాసిడ్. బలమైన ఆహారంలో సరైన విటమిన్లు మరియు ఖనిజాలు ఉండటం తల్లీ బిడ్డ ఆరోగ్యానికి చాలా ముఖ్యం. ఫోలిక్ యాసిడ్ గర్భధారణకు మూడు నెలల ముందు మరియు ప్రారంభ 12 వారాల్లో రోజుకు 400 మైక్రోగ్రామ్స్ తీసుకోవాలి. ఇది మెదడు, వెన్ను వంటి ప్రధాన జన్మ లోపాలను నివారించడంలో సహాయపడుతుంది.

మందులు గురించి వైద్యుడితో చర్చించండి:

కొత్త మందులు ప్రారంభించడానికి లేదా ప్రస్తుత మందులను ఆపే ముందు తప్పనిసరిగా వైద్య సలహా తీసుకోండి.

టీకాలు సమయానికి వేయించుకోండి:

టీకాలు అనేవి ఆరోగ్యాన్ని కాపాడటానికి కీలకం. ఫ్లూ టీకాలు, టిటానస్ టీకాలు వంటివి చాలా ముఖ్యం. ఫ్లూ వంటి రోగాలు ముందస్తుగా ప్రసవం చేసే ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే టీకాలు సమయానికి వేయించుకోవాలి.

గర్భానికి ముందు లైంగిక వ్యాధులను తొలగించండి:

గర్భధారణకు ముందు లైంగిక వ్యాధులు ఉన్నాయా లేదా అనేది నిర్ధారించాలి.

ఆరోగ్యకరమైన బరువును కలిగి ఉండండి:

తక్కువ బరువు లేదా అధిక బరువు తల్లులు జన్మ లోపాల ప్రమాదాన్ని పెంచుతాయి. క్రమమైన వ్యాయామం, సమతుల ఆహారం ద్వారా సరైన బరువును చూసుకోవాలి. గర్భిణి తల్లికి అవసరమైన బరువు పెరగడం కూడా వైద్యుడి సూచనల మేరకు ఉండాలి.

విషప్రభావ కలిగించే పదార్థాలను దూరంగా ఉంచండి:

గర్భధారణ సమయంలో మద్యం, పొగాకు, ఇతర నషావ్యసన పదార్థాలను దూరంగా ఉంచి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోండి. మీ ఆరోగ్యం... మీ బిడ్డ ఆరోగ్యం! జాగ్రత్తలు తీసుకోండి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తును సృష్టించండి అన్నారు.

## ముఖ్య మంత్రి గారూ! కడప జిల్లా పై మీకు ఎందుకు అంత కక్ష

### బిడాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



వేంపల్లి : కడప జిల్లా పై ముఖ్య మంత్రి కక్ష కట్టడం దురదృష్టకరమని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు 7 అసెంబ్లీ స్థానాలకు గానూ 5 స్థానాలలో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం కడప జిల్లాకు అన్యాయం చేస్తూ వుందన్నారు.టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి 7 నెలలయింది.ఈ 7 నెలల కాలంలో జిల్లాకు అనేక అన్యాయాలు జరిగాయి. అందులో కొన్ని 1.రాష్ట్ర మంత్రి వర్గం లో జిల్లాకు ప్రాతినిధ్యం లేదు. గతం లో జిల్లానుంచి ముఖ్య మంత్రి,ఉప ముఖ్య మంత్రి ప్రాతినిధ్యం వహించేవారు. ప్రస్తుతం ఒక్క మంత్రి కూడా జిల్లా నుండి లేరు. 2.రాష్ట్ర ప్రభుత్వం రెండు దఫాలుగా కొండవీటి చాంతాడంత నామినేటెడ్ పదవుల జాబితా ప్రకటించింది. అందులో కడప జిల్లా నుంచి ఒక్క చైర్మన్ లేరు. 3.పుష్పక విమానం లాంటి టిటిడి బోర్డులో కడప జిల్లా నుంచి ఒక్కరూ కూడా లేరు. 4.శాంతి భద్రతల దృష్ట్యా కడప జిల్లా సున్నితమైన, కీలకమైన జిల్లా.గత రెండున్నర నెలలుగా 6-11-2024 నుంచి రెగ్యులర్ ఎస్పీ లేదు. పొరుగున వున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ నే ఇన్చార్జి ఎస్పీగా వున్నారు. 5.కేంద్ర ప్రభుత్వం 4-12-2023న కొప్పర్తి పారిశ్రామిక వాడకు రు 250 కోట్లతో ఎమ్మెస్ ఎంఇ టెక్నాలజీ సెంటర్ ను మంజూరు చేసింది. దీనిని కొప్పర్థి నుండి అమరావతి కి తరలిస్తూ24-9-2024 న రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. 6.పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి 50 ఎంబిబిఎస్ సీట్లు కేటాయిస్తూ నేషనల్ మెడికల్ కమీషన్ 16-8-2024 న లెటర్ ఆఫ్ పర్మిషన్ ఇచ్చింది.మేము నిర్వహించ లేము.వసతి సౌకర్యం లేదు, ఫాకల్టీ లేదు,ఆ సీట్లు మాకు వద్దు అని రాష్ట్ర ప్రభుత్వం 10-9-2024 న నేషనల్ మెడికల్ కమీషన్ కు లేఖ వ్రాసింది.దానితో ఆ 50 సీట్లు రాకుండాపోయాయి. 7.రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేయని కారణంగా కడప - రాయచోటి - మదన పల్లి - బెంగుళూరు నూతన బ్రాడ్ గెజ్ పనులు మధ్యలో నిలిచిపోయాయి. 8.రోడ్డు విస్తరణ పేరుతో 4 సంవత్సరాల క్రిందట వేంపల్లి - రాయచోటి రొడ్డును త్రవ్వి వదిలి పెట్టారు.ప్రయాణికులు ఆ రోడ్డు మీద నరకం చూస్తున్నారు.పట్టించుకున్న నాథుడే లేడు. 9.కడప - రాజంపేట - కోడూర్ - రేణిగుంట జాతీయ రహదారి టెండర్లు అయిపోయి 15 నెలలైనా పనులు మొదలు పెట్టలేదు.ఈ మార్గంలో రద్దీ ఎక్కువగా వుంటుంది. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. 10.విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగాలి.ఆ ఊసే లేదు.శనివారం ముఖ్యమంత్రి కడప జిల్లాకు వస్తున్న సందర్భంగా పై సమస్యలపై దృష్టి సారించాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువ కుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, ఆరు సేర్ల సుబ్బ రాయుడు, వెంకటేష్, రమణ, మహబూబ్ బాషా (మాస్),వేమా నాగ రాజా, తిరుమల శెట్టి వెమయ్య, బద్రి,,రవి,మధార్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి



వేంపల్లె : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా జనసేన పార్టీ పులివెందుల నియోజకవర్గ సీనియర్ నేత డా దాసరి రవిశంకర్ ఆద్వర్యంలో వేంపల్లి లోని తన కార్యాలయంలో శ్రీ కృష్ణ దేవరాయలు చిత్రపటానికి పూల మా లలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ తెలుగు భాష జాతి వైభవాని నలుమూలల కు చాటి చెప్పిన విజయనగర సామ్రాజ్య వీరులు, అఖండ భారత మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఇందులో వేంపల్లె మండలం జనసేన యువ నాయ కుడు తిరుమల శెట్టి నాగ మల్లి కార్జున, కార్యకర్తలు , మహ బూబ్ బాషా, పరశురాముడు, శీను, శేషు, మహేష్, సాయి తేజ పాల్గొన్నారు

## శ్రీస్వామి వారి హుండీ లెక్కింపు

## మొత్తం రూ.82,14,097/-

### శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము



కదిరి పట్టణం, : ప్రహ్లాద సమేత స్వయంభూగా వెలశియున్న శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము కదిరి పట్టణము, శ్రీ సత్యసాయి జిల్లా., ఆంధ్రప్రదేశ్ ఫోన్ నెం: 08494 - 221066, 221366 శ్రీస్వామి వారి హుండీ లెక్కింపు మొత్తం రూ.82,14,097/- శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము, కదిరి కి సంబందించిన హుండిల లెక్కింపు కార్యక్రమము 17.01.2025 వతేది శుక్రవారము లెక్కింపు పూర్తి అయినందున నగదుగా రు.82,14,097/-లు మొత్తము 58 రోజులు వచ్చినది. బంగారు 8 గ్రాములు, వెండి 406 గ్రాములు కలదు. విదేశి కరెన్సీ హుండీల లెక్కింపు కార్యక్రమము ఆలయ కార్య నిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి అధ్వర్యములో లెక్కింపు చేపట్టడమైనది. హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారిగా శ్రీ.యన్.ప్రసాద్, తనిఖీఅధికారి, దేవాదాయశాఖ, హిందూపురము డివిజన్ వారు హాజరు అయినారు. హుండి లెక్కింపు కార్యక్రమములో దేవస్థానము సిబ్బంది మరియు ఎ.పి.జి.బ్యాంకు, యం.జి.రోడ్డు శాఖ, కదిరి మేనేజర్ శ్రీ.సి.బి.చలపతి మరియు బ్యాంకు సిబ్బందితో పాటు వివిధ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



## కదిరి వైయస్సార్సీపి ఇంచార్జ్ ధన్యవాదాలు తెలిపిన జిల్లా కార్యదర్శి చిన్న కృష్ణారెడ్డి



తలుపులమండలం : కదిరి జిల్లా కార్యదర్శి గా ఎన్నికైన సందర్భంగా బి.యస్.మక్బూల్ అహ్మద్ మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేసిన చెన్న క్రిష్ణారెడ్డి వైసిపి జిల్లా కార్యదర్శి ఎన్నికైన తలుపుల మండలానికి చెందిన చెన్న క్రిష్ణారెడ్డి. కదిరి వైసిపి సమన్వయకర్త బి.యస్.మక్బూల్ అహ్మద్ స్వగృహం నందు కలిసి పూలబొకే అందజేసి ధన్యవాదాలు తెలియజేశారు

**జిల్లా కార్యదర్శి చెన్న క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ**

నాపై ఎంతో నమ్మకం ఉంచి నన్ను వైసిపి జిల్లా కార్యదర్శి నియమించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులువైయస్ జగన్మోహన్ రెడ్డి . జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి కె.వి.ఉషశ్రీ చరణ్ కదిరి వైసీపీ సమన్వయకర్త బి.యస్. మక్బూల్ అహ్మద్ కుహృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ప్రతి ఒక్కరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని , ఎప్పుడు ఎన్నికలు జరిగిన వైసిపి గెలుపు కు కృషి చేస్తానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## స్వర్గీయ ననందమూరి తారక రామారావు 29 వ వర్ధంతి కార్యక్రమం జయప్రదం చేయండి



తనకల్లు : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు , విశ్వవిఖ్యాత నట సార్వ భౌముడు,తెలుగువారి ఆత్మ గౌరవం ,మాజీ ముఖ్యమంత్రి వర్యులు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి 29వ వర్ధంతి సందర్భంగా శనివారం ఉదయం 8:30 గంటలకు కదిరి మున్సిపల్ ఆఫీస్ దగ్గర వున్న తారక రామారావువిగ్రహనికి పూల మాల వేసి అక్కడి నుంచి ర్యాలీ గా పీ.వి.ఆర్ ఫంక్షన్ హాల్ కు వద్దకు చేరుకుంటారు.. కదిరి పట్టణం మదనపల్లి రోడ్డు లో గల పీవిఆర్ ఫంక్షన్ లో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ అన్న ఆధ్వర్యంలో జరిగే రక్తదాన శిబిరం లో ప్రతి కార్యకర్త,నాయకులు, అభిమానులు, అన్ని అనుబంధ విభాగాల నాయకులు పాల్గొని రక్తదానం చేసి...మెగా బ్లడ్ డోనేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా మరి మరి కోరుచున్నాము మండల తెలుగుదేశం నాయకులు తెలిపారు

## జాగ్రత్తలు పాటించండి ప్రమాదాలకు దూరంగా ఉండండి

### మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్




పులివెందుల : 36వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం పులివెందులలోని ఆర్టీసీ డిపో నందు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి వి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు ప్రశాంతమైన మనసుతో విధులకు హాజరుకావాలని, రోడ్డు ప్రమాదాలు చాలావరకు మానవ తప్పిదం వల్లనే జరుగుతున్నాయని, డ్రైవర్లు నిర్లక్ష్యంగా ఓవర్టేక్ చేయరాదని, రోడ్డు మలుపులలో అధిక వేగంతో నడప రాదని, డ్రైవర్ల కంటిచూపు సరిగ్గా లేకపోవడం వంటి కారణాలు కూడా ఉన్నాయని, డ్రైవర్లు జాగ్రత్తలు పాటించినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చునని డ్రైవర్లకు సూచనలు సలహాలు అందించారు ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీ రమకృష్ణ ఎస్ టి ఐ కులయప్ప, ఎమ్ ఎఫ్ శ్రీకాంత్, ఎస్ డి ఐ గోపాల్ రెడ్డి మోటార్ వెహికల్ సిబ్బంది ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు

## రేషన్ డీలర్ల పరీక్ష కేంద్రం వద్ద ఘర్షణ

### ప్రజాస్వామ్యంలో ఉన్నామా అంటూ పరీక్ష కేంద్రం వద్ద బైఠాయించిన ఎమ్మెల్సీ సతీమణి



పులివెందుల : పులివెందులలో నిర్వహిస్తున్న రేషన్ డీలర్ల పరీక్ష కేంద్రం వద్ద తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తుల మధ్య శనివారం ఘర్షణ చోటు చేసుకోవడంతో, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి పరీక్ష కేంద్రం వద్ద బైఠాయించి ప్రజాస్వామ్యంలో ఉన్నామా అంటూ ప్రశ్నిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే పులివెందుల టౌన్ లో అహోబిలంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ నందు రేషన్ డీలర్ల నోటిఫికేషన్ పై శనివారం ఉదయం 10:30 గంటలకు ఎగ్జామ్ జరుగుతున్న సందర్భంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సంబంధించిన మనిషి వేంపల్లి మండలానికి చెందిన తమ్మిశెట్టి ప్రకాష్ తండ్రి పేరు తంబిశెట్టి రవి అ వ్యక్తి స్టోర్ డీలర్ ఎగ్జామ్ రాయుటకు 10 గంటలకు పై స్కూల్ వద్దకు రాగా అతనిని టిడిపి పార్టీకి చెందిన వేంపల్లి మండల ఇన్చార్జి రఘునాథరెడ్డి అనుచర వ్యక్తులు పరీక్ష రాయనికి వెళ్ళనీకుండా అతనిని పరీక్ష కేంద్రం దగ్గర నుంచి పక్కకు పిలుచుకొని పోయి బట్టలు చించి కాళ్ల, చేతులతో కొట్టడం జరిగింది. వేంపల్లి కు చెందిన తమ్మిశెట్టి ప్రకాష్ అతను రేషన్ షాప్ నెంబర్ 1143035, షాపు ఏరియా ప్రియా తోట తెంపల్లి వారి నుంచి తప్పించుకుని జరిగిన విషయాన్ని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి మనుషులకు తెలపడంతో విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి వచ్చి 10-15 నిమిషాలకు హై స్కూల్ గేటు ముందర బయట నుంచి పదినిమిషాల పాటు నిరసన తెలియజేసినారు. విషయం తెలిసిన వెంటనే పులివెందుల డిఎస్పి అర్బన్ సిఐ, రూరల్ సిఐ , అర్బన్ సిఐ , సిబ్బంది తోటి సంఘటనా స్థలానికి చేరుకొని ఘర్షణ సర్దుబాటు చేసి,

## పులివెందుల వైసిపి పట్టణ కన్వీనర్లకు సత్కారం



పులివెందుల : పులివెందుల వైసీపీ పట్టణ కన్వీనర్ లు ఎన్నికైన హాల్ గంగాధర రెడ్డి, హఫీజ్ లకు జే సి యస్ కన్వీనర్ పార్నపల్లి కిషోర్ ఆద్వర్యం లో మునిసిపల్ చైర్మెన్ వరప్రసాద్ మరియు మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిన్నప్ప చేతుల మీదుగా ఘన సత్కారం చేశారు . ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్లు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి మరియు మున్సిపల్ ఇంచార్జ్ వైయస మనోహర్ రెడ్డి లకు ముందుగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, వైకాపా పార్టీ తమపై ఎంతో నమ్మకంతో ఈ పదవులను అప్పగించడం జరిగిందని పార్టీ అభివృద్ధికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, పార్టీ మనుగడ కోసం అనునిత్యం పాటుపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో నూర్ భాషా సంఘం అధ్యక్షులు రసూల్ కౌన్సిలర్ లు ఖాదర్ భాషా సిద్దయ్య పద్మనాభ రెడ్డి డానీ ఇతర వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## శివ మాల ధరించడం ఒక పుణ్యకార్యం



పులివెందుల : పులివెందుల మండల పరిధిలోని ఎర్రబెల్లి హరిజనవాడ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున శివమాలలు ధరించడం జరిగింది శ్రీ గుండాలయ్య మల్లేశ్వర స్వామి దేవస్థానం దగ్గర. శివయ్య మాల దారుణం. వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా కడప జిల్లా అధ్యక్షులు. కోడుమూర్తి శ్రీరాములు మాట్లాడుతూ. ఎన్నో జన్మలు చేసుకున్న పుణ్యమో ఈ జన్మలో శివదీక్ష మాల ధరించడము ఎంతో శుభదినం ఈ మాఘ మాసంలో శివమాల వేసే భక్తులు కు. ఒక జత వస్త్రములు. మండలము వేసే ప్రతి ఒక్కరు. శివ స్వాములకు. వితరణ చేయడం జరిగింది. స్వామి మేము శివమాల ధరిస్తాము అని. మాకు ఒక జత బట్టలు కావాలంటే. అంటే. నేను వితరణ సంసిద్ధంగా ఉంటాను. ఎంతో పవిత్రంగా ఇంటిళ్ల పాలిట. సంతోషంగా ఉండాలని. కోరుచున్నాను మహాశివరాత్రి కి 41 దినము దీక్షతో శివుని భక్తిశ్రద్ధలతో వేడుకొని. ఈ 41 వ. దినం మహాశివరాత్రికి సంతోషంగా బయలుదేరాలని కోరుకుంటున్నాను ఈ కార్యక్రమంలో ఎర్రబల్లె హరిజనవాడ శివ స్వాములకు ధన్యవాదములు తెలిపారు.

## దళితుల భూములకు రక్షణ కల్పించండి....

### తహసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన దళిత నాయకులు...



గార్లదిన్నె : గత కొద్ది రోజులుగా ఇల్లూరు గ్రామంలో అన్యాక్రాంతమైన దళితుల భూముల విషయమై పలు మీడియా కథనాలు వెలువడుతున్న సందర్భంగా దళిత సంఘాల నాయకులు స్పందిస్తూ గార్లదిన్నె మండల తహసిల్దార్ కు గురువారం వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ ప్రజా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుల్లాయప్ప మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో దళితుల అభివృద్ధికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు అనేక చట్టాలు తీసుకొచ్చినప్పటికీ దేశం మొత్తం రాజ్యాంగంను పాటిస్తున్నప్పటికీ కొందరు అగ్రవర్ణ అధికులకు మాత్రం కుల వివక్ష చావక దళితులను ఎక్కడికక్కడ అనిచివేయాలని చూస్తున్నారని, తరాలు మారిన దళితుల తలరాతలు మాత్రం మారట్లేదని అందుకు ఇల్లూరు గ్రామంలో దగా పడ్డ రైతులకథే నిదర్శనమని ఆయన తెలియజేశారు. అసలే అరకొరగా ఉన్న దళితుల భూములను వారేమి చేయలేరని నెపంతోనో, చిన్న చూపుతోనో దళితులను అనిచివేయాలనే దురాలోచనతో ఆక్రమణలు చేసి అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆయన తెలియజేశారు. ఆ భూములే వారి జీవనాధారమైన రైతులు తమ భూములు పోగొట్టుకొని దిక్కులేని వారిలా అవస్థలు పడుతున్నారని, దళితులు కాబట్టి వారికి ఎవ్వరూ సపోర్టు రారని నెపంతో చులకన భాగంగా చూస్తున్నారని అందుచేతనే వారికి అండగా దళిత సంఘాల తరపున పోరాటం చేస్తామని అందులో భాగంగానే గురువారం గార్లదిన్నె మండల తహసీల్దార్ కు దళితుల భూముల రక్షణకై వినతిపత్రం అందజేయడం జరిగిందని త్వరిత గతిన వారి సమస్యను అధికారులు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని ఎస్సీ ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుల్లాయప్ప తెలియజేయడం జరిగింది. ఈ విషయమై మండల తహసిల్దార్ ఈరమ్మ స్పందిస్తూ దళితుల భూముల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన విచారణ జరిపిస్తామని తెలియజేయడం జరిగింది.

## అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత




ఆత్మకూర్ : అక్రమంగా తరలిస్తున్న ప్రజా పంపిణీ బియ్యాన్ని పట్టుకున్నట్లు స్థానిక సీఐ సంతోష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చౌల్లపల్లి గ్రామ శివారులో పెట్రోలింగ్ చేస్తుండగా విశ్వాసనీయ సమాచారం మేరకు పెద్దాపూర్ గ్రామం నుండి మహారాష్ట్రకు 30 కింటాలు, 70 బస్తాలను పిడిఎఫ్ బియ్యం ట్రాలీ వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని, బియ్యం వాహనాన్ని సీజ్ చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

## 68ఏళ్ల తర్వాత దుర్గమ్మ అమ్మవారి జాతరకు సన్నాహకాలు

### మూడు గ్రామాల పెద్దలతో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ సమావేశం

### నసనకోట దుర్గమ్మ దేవాలయం వద్ద పరిటాల శ్రీరామ్ తో కలసి గ్రామ పెద్దలతో చర్చించిన పరిటాల సునీత



రాప్తాడు : 68ఏళ్ల తర్వాత దుర్గమ్మ అమ్మవారి జాతర నిర్వహించేందుకు సన్నాహకాలు జరుగుతున్నాయి. రామగిరి మండలం నసనకోట-గంగంపల్లి గ్రామాల మధ్య కొలువై ఉన్న దుర్గమ్మకు 68ఏళ్ల క్రితం జాతర జరిగింది. నసనకోట, గంగంపల్లి, వెంకటాపురం గ్రామస్థులు ఐక్యంగా ఈ జాతర జరుపుకునే వారు. అయితే పలు కారణాలతో జాతర నిర్వహించలేదు. ఈ ఏడాది జాతర నిర్వహించాలని మూడు గ్రామాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇదే విషయాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె శుక్రవారం అమ్మవారి ఆలయం ప్రాంగణంలో మూడు గ్రామాల పెద్దలతో సమావేశం అయ్యారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. జాతర ఈసారి నిర్వహించాల్సిందేనని మూడు గ్రామాల పెద్దలు నిర్ణయించారు. అయితే ఇది ఎలా నిర్వహించాలి.. అమ్మవారి ఆలయం వద్ద ఇది సాధ్యం అవుతుందా వంటి అంశాల గురించి చర్చించారు. మూడు గ్రామాల ప్రజలు పలు అభిప్రాయాలను ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. అందరి అభిప్రాయాలు విన్న తర్వాత జాతర కచ్చితంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ తెలిపారు. అయితే ఎప్పుడు ఎలా అన్నది మరోసారి సమావేశమై త్వరలోనే నిర్ణయం



# నా ధైర్యం నా బలగం వైయస్ కుటుంబమే

### వైయస్ కుటుంబం కోసం దేనికైనా సరే

### తప్పుడు ఆరోపణలు మానుకుంటే రాజకీయ మనుగుడా ఉంటుంది

### వేల్పుల గ్రామం ఒక ఊరు కాదు అది నా కుటుంబం

### వేముల టిడిపి పార్థసారధి రెడ్డి పై వేల్పుల రాము ధ్వజం



పులివెందుల : వైయస్ కుటుంబం కోసం తాను ఎంతవరకు అయినా సరే ఎంత దూరమైనా సరే వెళ్తానంటూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వేముల మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి వేల్పుల రాము పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..వేముల మండలానికి చెందిన తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసార రెడ్డి చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు అనవసరమైన ఆరోపణ చేయడం సమంజసం కాదని అంతకు ముందునీ స్థాయి తెలుసుకొని ఎదుటివారిపై నిందలు వేయాలని సూటిగా ప్రశ్నించారు. ఒకప్పుడు నా దగ్గర రూ. 1000 నుంచి రూ. 5000 కోసం పడికాపులు కాసిన నువ్వు నా గురించి మాట్లాడే అర్హత లేదు అని రాము అన్నారు. 13వ తేదీ రాత్రి జరిగిన మైన్స్ లూటీ పై రామ స్పందిస్తూ..అక్కడ నిల్వ ఉన్న ముగ్గురాయిని తరలిస్తున్నారని తనకున్న సమాచారం ప్రకారం పోలీసులకు మరియు సంబంధిత అధికారులకు వాట్సప్ ద్వారా మెసేజ్ తెలియజేసినప్పటికీ వారు స్పందించలేదని ఇదే అదునుగా భావించిన ఈ వేముల మండలానికి పరిమితమైన పార్థసారథి రెడ్డి అక్రమంగా ముగ్గురాయిని టిప్పర్ మరియు జెసిపి లను వినియోగించుకొని తమ అనుచరులను అడ్డుపెట్టుకొని తరలించడం జరిగిందన్నాడు. ఆ విషయాలు పక్కన పెట్టేందుకు ప్రజలను మరియు అధికారులను డైవర్షన్ చేయడం జరుగుతుందన్నారు. నేను గతంలో మైన్స్ లో ఉన్న మాట నిజమే అది నాకు సంబంధిత వ్యక్తుల దగ్గర నుంచి అన్ని అనుమతులతోనే మైన్స్ చేశానని అన్నారు. వాటికి కావలసిన అన్ని పత్రాలు నా వద్ద ఉన్నాయని వాటి అనుగుణంగానే నేను నడుచుకున్నాననీ, అందులో ఉన్న ఏ ఒక్క నిబంధనను కూడ నేను ఏనాడూ అతిక్రమించలేదని, దాని విషయంపై ఎలాంటి చర్చ కైనా నేను సిద్ధమని సవాల్ విసిరారు. అయితే అలా తప్పు చేసి ఉంటే నేనే సూసైడ్ చేసుకొని చనిపోతా అని అన్నారు. కూటం ప్రభుత్వం అధికారం వచ్చినప్పటి నుంచి మీ దౌర్జన్యాలు ఎక్కువ అయ్యాయని పేర్కొన్నారు. ఎవరైనా నాయకుడంటే ఆ గ్రామము మరియు వారి కుటుంబ సభ్యులను క్రమశిక్షణ నడిపించాల్సింది పోయి నీ కుటుంబ సభ్యులను మద్యానికి బానిసలు చేసి దౌర్జన్యాలకు అలవాటు చేస్తున్నావని అన్నారు. నువ్వు నా వ్యక్తిగత కుటుంబా విషయాలు మాట్లాడావు కాబట్టే నేను కూడా ఈ విషయాలు మాట్లాడాల్సి వచ్చిందని పేర్కొన్నారు. వేల్పుల అనేది ఒక ఊరు కాదని అది నా కుటుంబం అని ఎప్పటినుంచో నన్ను ఆ గ్రామం ఆదరిస్తుందని ఆ గ్రామ ప్రజలు నా గుండెల్లో ఉన్నారని అటువంటి గ్రామంలో చిచ్చులు పెట్టేందుకు నువ్వు ప్రయత్నిస్తున్నావని అది ఎప్పటికీ జరగవు అని నా ప్రజల కోసము నా వాళ్ళ కోసం నేను ఎంతవరకైనా వెళ్తానని అన్నారు. నా తండ్రి ఆక్సిడెంట్ లో చనిపోతే అనవసరంగా అది హత్య అనడం దుర్మార్గమైన చర్య అని ఈ సంఘటన కూడా రాజకీయం చేయడం సమంజసం కాదన్నారు. ఆ సమయంలో నా వయసు 9 సంవత్సరాలు అంతే కాకుండా మీరు మీ పార్టీ నాయకులు హత్య రాజకీయాలతో కుటుంబాలను విడగొట్టడమే మీ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందుకు ఉదాహరణ వైయస్ భాస్కర్ రెడ్డి వైఎస్ అవినాష్ రెడ్డి మరియు దేవిరెడ్డి శంకర్ రెడ్డిలు అన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి ఇప్పటికైనా ఇలాంటి నీచ రాజకీయాల పక్కన పెట్టి విలువలతో కూడిన రాజకీయాలు చేయాలన్నారు. నేను ఏపని చేసినా వాటికి సంబంధించిన లీగల్ సూచనలు ప్రకారమే నడుచుకుంటానని అలా కాకుండా ఎప్పుడూ అతిక్రమించనని రాము అన్నారు. కోట్ల రూపాయలతో నేను వర్కులు చేస్తూ ఉంటాను ఇలాంటి చిల్లర రాజకీయాలు చిల్లర అలవాటు నాకు లేవు అన్నారు. నువ్వు చేసిన తప్పును కప్పి పుచ్చుకో ఇలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ మీడియా సమావేశంలో పలువురు విలేకరులు అడిగిన ప్రశ్నలకు పేర్కొన్న రాము సమాధానం ఇచ్చారు. మీకు ఎర్రచందన స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి తో సంబంధాలు ఉంది కదా అని ప్రశ్నించగా దీనికి రాము సమాధానం ఇస్తూ నన్ను అతను దగ్గరికి తీసుకువెళ్లండి అతను నన్ను గుర్తుపట్టిన లేక మా ఇద్దరి మధ్య ఏదైనా సంబంధాలు ఉన్నాయని రుజువు చేస్తే మీరు విధించే శిక్షకు నేను సిద్ధమని అన్నారు. దయచేసి మీడియా వారు కూడా ఎదుటివారిపై ఆరోపణ చేసినప్పుడు వాస్తవాలు తెలుసుకొని రాయాలన్నారు. మీడియా సమావేశం పెట్టిన వ్యక్తులు వారి ఆలోచనలు మరియు వారి ప్రవర్తనను బట్టి ఎదుటివారిపై ఆరోపణలు చేస్తే వాటిని మీడియా ముందు పెట్టాలి అన్నారు. విలువ లేని వ్యక్తులు ఏదైనా మాట్లాడితే అది నిజం కాదని, తెలిసిన తర్వాత కథనాలు రాయాలి అన్నారు. ఇక వైఎస్ కుటుంబ విషయానికొస్తే..ఆ కుటుంబం అంటే నాకు ప్రాణం ఆ కుటుంబం కోసం నేను ఏమి చేయడానికైనా సిద్ధం అన్నారు. అంతేకాకుండా ఒక్కసారి వైఎస్ కుటుంబంతో ప్రయాణం



సాగిస్తే అది జీవిత కాలం మిగిలిపోతుందని నేను నా బిడ్డలకు కూడా ఒకటే మాట చెప్పాను బ్రతికున్నంత వరకు వైఎస్ కుటుంబం కోసం పనిచేయండి అని చెప్పానని అన్నారు .ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు వైకాపా వేముల మండల కన్వీనర్ నగ్గెళ్ల సాంబశివారెడ్డి, జెడ్పిటిసి కోకటం భయపరెడ్డి, వేల్పుల ఎంపీటీసీ బాబ్జాన్, సర్పంచ్ భర్త చిన్నోడు, బాబు, గంగిరెడ్డి, రమణా రెడ్డి, అమీర్ భాష, నాగభూషణ్ రెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గంగాధర మరియు తదితర మండల వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలి

- : సకాలంలో ఏర్పాట్లన్నీ పకడ్బందీగా పూర్తి చేయాలి

- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.



అనంతపురం, : -జనవరి 26వ తేదీన నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ఈనెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతపురం నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు సకాలంలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వేడుకలను మినిట్ టూ మినిట్ నిర్వహించేలా చూడాలని, ఎలాంటి లోటుపాట్లు ఎదురు కాకుండా చూసు కోవాలన్నారు. జిల్లా అధికారులు అంతా ఒక కుటుంబంలా వేడుకలను నిర్వహించాలన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా అనంతరత్న, అనంతశ్రీ, అనంత భూషణ్, అనంత విభూషణ్ లాంటి అవార్డులను కొత్తగా అందించేలా చూడాలని, ఇందుకోసం అసిస్టెంట్ కలెక్టర్ ని నోడల్ అధికారిగా నియమించడం జరిగిందన్నారు. అలాగే క్యాడర్ వారిగా అవార్డుల కోసం అధికారులను ఎంపిక చేయాలని, ఇందుకు డిఆర్ఓని ఇంచార్జ్ అధికారిగా నియమించామన్నారు. ఈ వేడుకల కోసం ఇన్విటేషన్ కమిటీని ఏర్పాటు చేసి డిప్యూటీ కలెక్టర్ ని ఇంచార్జిగా నియమించాలన్నారు. పెరేడ్ గ్రౌండ్లో జడ్జీలు, ప్రజా ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు, ప్రజల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల కోసం పెరేడ్ గ్రౌండ్ ని బాగా తయారు చేయాలని, పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అవార్డులు అందించే వారి కోసం సర్టిఫికెట్ ఫైనలైజ్ చేయాలన్నారు. వేడుకల్లో పాల్గొన్న వారికి తాగునీటి సరఫరా చేయాలని, స్నాక్స్ అందించాలని, శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గణతంత్ర వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఓ ఎ.మాలోల, ఆర్డీఓలు కేశవ నాయుడు, వసంత బాబు, ఎబివిఎస్బి శ్రీనివాస్, ఎస్డీసి శిరీష, డిపిఎం ఆనంద్, జడ్పి సిఈఓ ఆర్.రామచంద్ర రెడ్డి, సిపిఓ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిటిసి వీర్రాజు, హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, సర్వే ఏడి రూప్ల నాయక్, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, ఫిషరీష్ డిడి శ్రీనివాసనాయక్, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, ఐసిడిఎస్ పిడి వనజా అక్కమ్మ, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి, డీఈవో ప్రసాద్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్

### నెల కొక థీమ్ తో 12 మాసాలకు 12 థీమ్లతో

### కార్యక్రమ నిర్వహణకు చర్యలు

### జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



పుట్టపర్తి, : దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నెలలో ఒక శనివారం "స్వచ్ఛత" కోసం అంకితం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఇకపై ప్రతి మూడో శనివారం "స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సంబంధిత జిల్లా హెచ్ఓడీలతో మరియు మున్సిపాలిటీ కమిషనర్లతో, ఎమ్మార్వోలతో, ఎంపీడీలతో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్" కార్యక్రమాల అమలపై ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18 వ తేదీన కడప జిల్లా మైదుకూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సత్ ఫలితాలను ఆశిస్తూ ఈ నెల నుండి వచ్చే 12 నెలల పాటు నెల కొక థీమ్ తో 12 మాసాలకు 12 థీమ్ లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జనవరి మాసంలో న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ట్ థీమ్ తోను, ఫిబ్రవరి మాసంలో సోర్సు-రిసోర్సు థీమ్ తోను, మార్చిలో అవాయిడ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ ప్రమోట్ రీయూజబుల్స్ థీమ్ తోను , ఏప్రిల్ లో ఇ-చెక్ థీమ్ తోను, మే లో నీరు-మీరు థీమ్ తోను, జూన్ లో బీట్ ది హీట్ థీమ్ తోను, జులై లో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ థీమ్ తోను, ఆగస్టు లో మాన్ సూన్ హైజనిక్ థీమ్ తోను, సెప్టెంబరు లో గ్రీన్ ఏ.పి. థీమ్ తోను, అక్టోబరులో క్లీన్ ఎయిర్ థీమ్ తోను, నవంబరులో పెర్సనల్ కమ్యునిటీ హైజిన్ థీమ్ తోను మరియు డిశంబరు మాసంలో ఆపర్చునిటీస్ ఇన్ ఇన్విరాన్మెంట్ థీమ్ తోను ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అంశంలో కమ్యునిటీ ఎంగేజ్ మెంట్ ను ప్రోత్సహించడం, పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు మరియు పెట్టుబడిదారులను మరింత ఆహ్వానించే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపర్చడం మరియు పిల్లలు, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిదులను, అన్ని వర్గాల ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యులను చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమ నిర్వహణలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మరియు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కీలక భూమిక పోషించాల్సి ఉందని, అందుకు తగ్గట్టుగా ఆయా శాఖల అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. పంచాయితీ వారీగా మరియు మునిసిపాలిటీ వారీగా కార్యకలాపాలు నిర్వహించడానికి లెగసీ చెత్త కుప్పలను తొలగించడం మరియు మురుగునీటి కాలువల పూడికతీయడం మండల స్థాయి ఎంపీడీఓ లు మరియు మున్సిపల్ కమిషనర్లు మీ నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో ప్రజా ప్రతినిధి గౌరవనీయులైన ఎంపీ ఎస్ ఎమ్మెల్యేలను ఆహ్వానించాలి. ప్రతి ప్రతి ఇంటిని డోర్ టు డోర్ సందర్శించి ఖచ్చితమైన జియో కోఆర్డినేట్లను సంగ్రహించడానికి అందరూ ఎంపీడీఓ లు మరియు మున్సిపాలిటీ కమిషనర్లు అన్ని సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకునేలా చూసుకోవాలి. పెండింగ్ డేటా రేపు సాయంత్రం పూర్తి చేయాలి. రాబోయే ఒకటో తేదీన ఎంపీడీఓ లు మరియు మున్సిపల్ కమిషనర్లు, డి ఎస్ డబ్ల్యూ ఎస్ సిబ్బందితో సమన్వయం చేసుకుని ఇంటింటికీ వెళ్లి అన్ని పెన్షన్లను పంపిణీ చేయాలి.

### తప్పిపోయిన పౌరులు/ఉద్యోగుల డేటా:

అన్ని ఎంపీడీఓ లు మరియు మున్సిపల్ కమిషనర్లు రేపు సాయంత్రం తహశీల్దార్లతో సమన్వయం చేసుకుని తప్పిపోయిన పౌరుల డేటాను క్లియర్ చేయాలి. ఈ కార్యక్రమంలో, డిప్యూటీ జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డిపిఓ సమత, డి ఆర్ డి ఏ పి డి నరసయ్య, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, డి సి హెచ్ ఓ తిపేంద్ర నాయక్, కోపరేట్ అధికారి కృష్ణ నాయక్, జిల్లాలోని అన్ని శాఖల హెచ్ ఓ డి లు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే సుజానా చౌదరిని కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి

### హైదరబాద్ లోని సుజనా చౌదరి కార్యాలయంలో మర్యాదపూర్వక భేటి

### పలు అంశాల గురించి చర్చించుకున్న ఇరువులు నేతలు

### అనంతపురం అభివృద్ధి పై ఆరా తీసిన ఎమ్మెల్యే సుజునా

హైదరాబాద్ : మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరిని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. శుక్రవారం హైదరాబాద్ లోని సుజనా చౌదరి కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే దగ్గుపాటి ఆయనతో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఎమ్మెల్యే దగ్గుపాటితో సుజనా పలు అంశాలపై చర్చించారు. మొదటి సారి ఎమ్మెల్యే అయ్యారు కదా.. జిల్లా కేంద్రంలో అభివృద్ధి ఎలా ఉంది.. నేతల సహకారం ఇతరత్రా అంశాల గురించి ఆరా తీశారు. అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని.. ఇంకా కీలకమైన హామీలకు నిధులు రావాల్సి ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. మరోవైపు జిల్లా రాజకీయాల గురించి సుజనా ఆరా తీశారు. కూటమి పార్టీలు ఐక్యంగా ముందుకెళ్తాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి స్పష్టం చేశారు. కేంద్ర సాయంతో రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని సుజనా చౌదరి అన్నారు.

# వైరస్‌ను మించిన వైరల్

విశ్వ మహమ్మారిగా మారిన కరోనా సృష్టించిన బీభత్సం ఇంతా అంతా కాదు. 70 కోట్ల పైచిలుకు మంది వైరస్ బారిన పడితే అందులో ఏడు లక్షల మంది కన్నా ఎక్కువే ప్రాణాలు విడిచారు. సకల వ్యవస్థలు స్తంభించిపోయాయి. అంతటి ఘోరకలి చూసి ఉండటం వల్ల ఇప్పుడు ఏ చిన్న వైరస్ చిటుక్కుమన్నా ప్రపంచం ఉలిక్కి పడుతున్నది. తాజాగా చైనాలో బయటపడిన హెచ్ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమో వైరస్) కలకలం సృష్టిస్తున్నది. కరోనా భయావహ జ్ఞాపకాల నీడలో ఈ సరికొత్త వైరస్ కొంత బెదురు కలిగించడంలో ఆశ్చర్యం లేదు. కరోనా లాగే ఇదీ చైనాలో పుట్టడం, సోషల్ మీడియా ఊదరగొట్టడం ప్రస్తుత కలకలానికి కొంత కారణమని చెప్పక తప్పదు. గతవారం రోజులుగా మీడియాలో హెచ్ఎంపీవీ గురించిన కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. వైరస్ కన్నా వైరల్ అవుతున్న ప్రచారం ప్రమాదకరం. కరోనా పిల్లలకు ఎక్కువగా సోకకపోవడం, ప్రస్తుత వైరస్ పిల్లల్లోనే ముఖ్యంగా కనిపిస్తుండటం వంటి కారణాలు భయాలకు దారితీస్తున్నాయి. ఇప్పటివరకు పది లోపు కేసులు, అదీ గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. చైనాలో వ్యాపించింది నిగూఢమైన, లేదా సరికొత్త వైరస్ అనే కథనాలు విరివిగా వచ్చాయి. కానీ, ఇవేవీ నిజాలు కావని వెల్లడైంది. ఏటా శీతాకాలంలో శ్వాసకోశ వైరస్‌లు కొత్త రూపంలో బయటపడటం జరుగుతూనే ఉంటుంది. హెచ్ఎంపీవీ కూడా అంతేనని తెలియవస్తున్నది. ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ వైరస్‌ను కొవిడ్‌తో పోల్చి చూపడం జరుగుతున్నది. ఒక చానెల్ అయితే ఏకంగా మరో మహమ్మారి అంటూ చాటింపు వేస్తున్నది. ఇదంతా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరుతుండటం వల్ల అనవసరమైన ఆందోళనకు దారితీస్తున్నది. కొవిడ్‌కు, ప్రస్తుత వైరస్‌కు మధ్య మౌలిక తేడా ఏమిటో ప్రజలు తెలుసుకుంటే ఈ పరిస్థితి ఉండనే ఉండదు. కొవిడ్ మూలాలు ఇప్పటికీ తెలియవు. అది నిజంగా కొత్త వైరస్. కాగా హెచ్ఎంపీవీ తెలిసిన మూలాల నుంచి వచ్చిందే. పైగా అది ఆర్ఎన్ఏతో తయారైనది కాగా ప్రస్తుత వైరస్ డీఎన్ఏతో తయారైంది. అంతేకాదు, 2001 నుంచి ఈ వైరస్ వైద్య ప్రపంచానికి తెలిసిందేనని గూగుల్ సెర్చ్ చేసినా తెలిసిపోతుంది. కొత్త వైరస్ పూర్తిగా ఒకటి కంటే ఎక్కువ దేశాల్లో వ్యాపిస్తేనే దాన్ని పాండెమిక్ లేదా మహమ్మారి అంటారు. చైనాలో పెద్ద ఎత్తున శ్వాసకోశ వ్యాధులు పెరిగినట్టు తనకు ఎలాంటి సమాచారం అందలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించడం గమనార్హం. గత ఏడాది కన్నా ఈ ఏడాది కేసులు తక్కువగా ఉన్నట్టు చైనా వ్యాధుల నియంత్రణ, నివారణ విభాగం పేర్కొనడం ఆలోచించాల్సిన విషయం. మరోవైపు సరికొత్తదీ అని ప్రచారం చేస్తున్న వైరస్ గురించి అంతర్జాతీయ మీడియా పెద్దగా పట్టించుకోవడం లేదనేది గుర్తించాలి. హెచ్ఎంపీవీ గురించి భయపడిపోయి బెంగటిల్లడం కన్నా తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని వైద్య ప్రపంచం అంటున్నది. చికిత్స కంటే నివారణే ప్రధానమనేది తెలిసిందే. ఏ వైరస్ అయినా వ్యాపించే మార్గం ఒకటే. కరోనా పుణ్యమా అని జాగ్రత్తలూ తెలిసినవే. అవి సామాన్యమాన రీతిలో పాటించినా హెచ్ఎంపీవీ కాదు కదా, ఆ మాటకు వస్తే ఏ వైరస్ కూడా దరిచేరదు. ఈ లోగా సోషల్ మీడియా బెదరగొట్టకుండా ఉంటే చాలు.

# కొత్త నిర్ణయాలు ..
# కొనసాగిద్దాం ఇలా



నూతన సంవత్సరంలో అడుగు పెట్టేశారు.. హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ సందడి చేసే ఉంటారు.. బంధువులకు, స్నేహితులకు అందరికీ న్యూ ఇయర్ విషెస్ చెప్పే ఉంటారు..పనిలో పనిగా అది చేద్దాం, ఇది చేద్దాంఅని బోలెడు నిర్ణయాలు తీసుకొనే ఉంటారు. ఎప్పుడైనా ఆలోచించారా?..ఏటా జనవరిలో తీసుకునే నిర్ణయాలు ఎంతవరకు కొనసాగిస్తున్నామో అని. పోయిన ఏడాది తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు అమలు చేశారో.. ఓసారి గుర్తుతెచ్చుకోండి. చాలావరకు మధ్యలోనే వదిలేసి ఉంటారు కదా. మీరే కాదు.. ప్రపంచంలో 92 శాతం మంది ఇదే బాపతు. 2024 జనవరిలో 18 నుంచి 29 ఏళ్ల మధ్య వారు 49 శాతం, 30 నుంచి 49 ఏళ్ల మధ్య వారు 31 శాతం, 50 ఏళ్లు పైబడిన వారు 21 శాతం కొత్త నిర్ణయాలు తీసుకున్నారట. అందులో 43 శాతం మంది ఫిబ్రవరి నెలలో, 46 శాతం మంది ఆరు నెలల్లో తీసుకున్న నిర్ణయాలను గాలికి వదిలేశారట. కేవలం 8 శాతం మంది మాత్రమే ఏడాది చివరి వరకు వారు తీసుకున్న నిర్ణయాలను కొనసాగించారట. సో.. న్యూ ఇయర్‌లోకి అడుగు పెట్టగానే నిర్ణయాలు తీసుకోవడం, వాటిని మధ్యలోనే వదిలేయటం ఓ రివాజు అన్నమాట.

## సైనిక సంక్షేమ శాఖ కాలెండర్ ను ఆవిష్కరించిన, జిల్లా కలెక్టర్ డా వినోద్ కుమార్.



అనంతపురము,**(కదిలించే వార్త) జనవరి 17:** సైనిక సంక్షేమ శాఖ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ రెవెన్యూ భవన్ లో జిల్లా కలెక్టర్ డా వినోద్ కుమార్ వి. ఆవిష్కరించారు. రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ రూపొందించిన నూతన క్యాలెండర్ జనవరి మాసపు పేజీలో ఉమ్మడి అనంతపురము జిల్లా నుండి మన దేశ సరిహద్దుల్లో సైనిక విధులను నిర్వహిస్తూ మాతృ భూమి రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన సైనికుల ఫోటోలను వారి పేర్లు వివరాలతో ముద్రించిన అంశాన్ని జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప జిల్లా కలెక్టర్ డా . వినోద్ కుమార్ కు వివరించి క్యాలెండర్ ను అందించగా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి. వినూత్న , జిల్లా రెవెన్యూ అధికారి మాలోల , పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ రామచంద్ర కి ఘన సన్మానం



మడకశిర **(కదిలించే వార్త) జనవరి 17:** ఉద్యమంలో భాగంగా మడకశిర తాలూకా ను సందర్శించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామచంద్ర ని మడకశిరా తాలూకా నాయకులు కె. భూతన్న ,వి.ఎన్. మాలింగప్ప, వై. జోగప్ప, మూడ్లగిరియప్ప, బి. ఈశ్వరప్ప, దేవరాజు, రవి కుమార్, నరసింహ రాజు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ సంఘం జ్యోతిబాపూలే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు ప్రజాసేవ పరమావధి గా వారిని స్ఫూర్తిగా తీసుకొని పనిచేస్తుందని అందుకు ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ వర్గాల ఉద్యోగుల సంక్షేమం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునివ్వడం జరిగింది.

# రీసర్వే వినతులు అప్లోడ్ , పరిష్కారం ఏక కాలంలో జరగాలి

## అలసత్వం వహించే వారి పై చర్యలు తప్పవు
## జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



పుట్టపర్తి, : వినతులను పిజిఅర్ఎస్ లో అప్లోడ్ చేయడం, చేసిన వాటిని వెంటనే పరిష్కరించడం ఏక కాలంలో జరగాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు శుక్రవారం కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో రీ సర్వే , రెవిన్యూ సదస్సులలో అందిన వినతులపై సర్వేయర్ల తో మండలవరీగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డి ఆర్ వో విజయ సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే వినతుల పరిష్కారానికి మండల వారీగా లక్ష్యాలను ఇచ్చి వేగంగా పరిష్కారం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సర్వేర్లు సక్రంగా పనిచేయాలని తెలిపారు ఆర్డీవోలుప్రతిరోజు సమీక్షించాలని, లక్ష్యాలకు అనుగుణంగా పని చేయని వారి ఇంక్రిమెంట్లను నిలుపుదల చేయాలనీ సూచించారు. సర్వే శాఖ ఏ.డి కూడా ప్రతి రోజు పర్యవేక్షించాలని , సర్వేయర్ల పని తీరు పై ఆగ్రహం వ్యక్తం చేసారు. రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులలో డూప్లికేషన్ తీసేసి మిగిలిన వాటిని పిజిఅర్ఎస్ లో అప్లోడ్ చేయాలనీ ఆదేశించారు. శనివారం సాయంత్రం లోపల మొత్తం అప్లోడ్ చేయాలనీ తెలిపారు. ఇపటికే పరిష్కారం చేసిన వినతులను డిప్యూటీ కలెక్టర్లు ఆడిట్ చేయాలనీ, ఒక్క వినతికి తప్పుడు సమాధానం ఇచ్చినా సంబంధిత అధికారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసారు. రెవిన్యూ వినతులను సబ్జెక్టు వారీగా వర్గీకరించి ఆర్.డి.ఓ లు పంపాలని, డి.ఆర్.ఓ వాటి పరిష్కారానికి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ, పెనుగొండ ఆర్డిఓ ఆనంద్, ఆర్డీవో కదిరి శర్మ, ధర్మవరం ఆర్డీవో మహేష్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతి వర్సెస్ కాంతి



రాత్రి తొమ్మిది కావొస్తున్నది. ఏదో కేసు ఫైల్ చూస్తున్నాడు ఇన్‌స్పెక్టర్ రుద్ర. ఇంతలో మొబైల్ మోగింది. 'సార్.. ఓఆర్ఆర్ మీద ఒక వ్యక్తి చనిపోయి ఉన్నాడు. మీరు త్వరగా రండి'.. ఫోన్‌లో అటునుంచి ఎవరో కంగారుపడుతూ చెప్పాడు. వివరాలు తీసుకొన్న రుద్ర సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొన్నాడు. మృతుడి వయసు 20 ఏండ్లకు అటూ ఇటూగా ఉంటుంది. శరీరాన్ని ఏదో జంతువు రక్కిన గుర్తులు కూడా ఉన్నాయి. 'ఫోన్ చేసింది మీరేనా?' ఎదురుగా ఉన్న వ్యక్తిని ప్రశ్నించాడు రుద్ర. 'అవును సార్. నేనే మీకు ఫోన్ చేశా' సమాధానమిచ్చాడు అతను. 'మీ పేరు? ఈ టైమ్‌లో మీరు ఇక్కడేం చేస్తున్నారు? ఓఆర్ఆర్‌పై ఎందుకు ఆగినట్టు?' సూటిగా ప్రశ్నించాడు రుద్ర. 'సార్.. నా పేరు క్రాంతి. నేను కొత్తగా కొన్న నా ఎలక్ట్రిక్ కారులో వెళ్తున్నా. బ్యాటరీ డౌన్ కావడంతో కారు ఆగిపోయింది. చార్జింగ్ స్టేషన్లు కూడా దగ్గర్లో ఎక్కడా కనిపించలేదు. ఇంతలో ఎదురుగా రోడ్డు మీద జంతువు దేన్నో రక్కుతున్న శబ్దం వినిపించింది. ఏంటా అని కారు హెడ్‌లైట్లు ఆన్‌చేసి చూశా. ఎదురుగా శవం కనిపించింది. వెంటనే మీకు ఫోన్ చేశా' ఆందోళనతో క్రాంతి చెప్తూ పోయాడు. సరేనన్న రుద్ర.. క్రాంతి ఫోన్ నంబర్, ఇతర వివరాలు తీసుకొన్నాడు. ఇంతలో..'సార్.. ఇదేదో యాక్సిడెంట్ కేసులా కనిపిస్తుంది. పాపం కుర్రాడిది చిన్నవయసే' అంటూ బాధపడ్డాడు హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి. 'అవును బాబాయ్. చిన్నవయసే. కానీ, ఇది యాక్సిడెంట్ కేసులా కనిపించట్లేదు. నిజంగా యాక్సిడెంట్ జరిగితే ఓఆర్ఆర్ మీద వాహనాలు వచ్చే స్పీడ్‌కు డెడ్‌బాడీ పరిస్థితి ఇంకోలా ఉండేది. అయితే ఈ కుర్రాడి శరీరం మీద ఏ కుక్కనో, నక్కనో రక్కినట్టు కొన్ని గుర్తులు ఉన్నాయి తప్ప మరేం గాయాలు కనిపించట్లేదు. ఏదేమైనా, ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చాక గానీ మరిన్ని విషయాలు తెలియవు' అన్నాడు రుద్ర. అవునన్నట్టు తలూపాడు రామస్వామి. 'సార్.. నాకు లేట్ అవుతుంది. నేను వెళ్లొచ్చా?' క్రాంతి అడిగాడు. 'బ్యాటరీ డౌన్ అయ్యి కారు చెడిపోయింది అన్నారుగా. ఎలా వెళ్తారు?' ప్రశ్నించాడు రుద్ర. 'ఏదైనా క్యాబ్ బుక్ చేసుకొని వెళ్తా' సమాధానమిచ్చాడు క్రాంతి. 'మరి కారు?' మళ్లీ ప్రశ్నించాడు రుద్ర. 'రేపు వచ్చి కారు తీసుకుపోతాను సార్' మళ్లీ బదులిచ్చాడు క్రాంతి. 'హత్య గురించి ఇంతరాత్రి పూట మాకు విలువైన సమాచారం ఇచ్చారు. మిమ్మల్ని ఒక్కరినే అలా ఎలా పంపిస్తాం? మరేంపర్లేదు. మిమ్మల్ని మా కానిస్టేబుల్స్ ఇంటి దగ్గర విడిచిపెడతార'ని రుద్ర క్రాంతికి చెప్పాడు. ఫోరెన్సిక్ రిపోర్ట్ రాకముందే, ఆ కుర్రాడిది హత్య అని రుద్ర ఎలా కనిపెట్టాడని రామస్వామిసహా మిగతా కానిస్టేబుల్స్ అందరూ ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఇంతలో 'నేను ఒంటరిగానే వెళ్తా సార్. పోలీసుల సాయం ఏమీ వద్దు' అంటూ కాస్త భయపడుతూ క్రాంతి అన్నాడు. 'ఎందుకు వద్దు?' గద్దించాడు రుద్ర. 'మాది పద్ధతిగల ఫ్యామిలీ సార్.. ఇంటికి పోలీసులు వస్తే, మా అమ్మానాన్న తట్టుకోలేరు' అన్నాడు క్రాంతి. 'మరి అంత పద్ధతిగల ఫ్యామిలీ నుంచి వచ్చిన నువ్వు.. ఈ కుర్రాడిని ఎందుకు చంపావ్?' బాంబు పేల్చాడు రుద్ర. ఒక్కసారిగా నిశ్శబ్ద వాతావరణం. 'సార్.. ఏం మాట్లాడుతున్నారు? యాక్సిడెంట్‌కు సంబంధించిన ఇన్ఫర్మేషన్ ఇవ్వడం కూడా తప్పేనా? అదే తప్పయితే ఇకపై ఎవరూ ఎవరికీ ఏ సాయం చేయరు. మానవత్వమే మంటగలిసిపోతుంది' అంటూ ఏడ్చినంత పని చేశాడు క్రాంతి. 'డియర్ క్రాంతి. ఈ సెంటిమెంటల్ డైలాగ్స్ ఇక ఆపడం నీకే బెటర్. ఈ హత్య నువ్వే చేశావని ఇప్పటికిప్పుడు నేను రుజువు చేయగలను. మర్యాదగా నువ్వే నిజం చెప్తే అది నీకే మంచిది' స్పష్టంగా అన్నాడు రుద్ర. కాస్త ఆలోచించాక.. ఏం పాలుపోని క్రాంతి.. ఆ హత్య తానే చేశానని ఒప్పేసుకొన్నాడు. అయితే ఆ కుర్రాడికి తనకు ఎలాంటి సంబంధంలేదని, తాను ఈ హత్య కావాలని చేయలేదని ఓ షాకింగ్ విషయం కూడా చెప్పాడు. అది విన్న రుద్ర అండ్ టీమ్‌కు ముచ్చెమటలు పట్టాయి. ఆ విషయం పక్కనబెడితే, క్రాంతినే ఆ కుర్రాడిని హత్య చేశాడని రుద్ర ఎలా కనిపెట్టాడు? ఓఆర్ఆర్‌పై పడివున్న కుర్రాడిని తానే హత్య చేశానని ఎట్టకేలకు ఒప్పుకొన్న క్రాంతి.. ఆ కుర్రాడికి తనకు ఎలాంటి సంబంధంలేదని, తాను ఈ హత్య కావాలని చేయలేదని చెప్పాడు. దీంతో మరెందుకు ఈ హత్య చేశావని ఇన్‌స్పెక్టర్ రుద్ర గద్దించాడు. దీనికి క్రాంతి స్పందిస్తూ.. 'సార్.. గత కొన్ని రోజులుగా నన్ను ఓ చీకటి శక్తి వెంటాడుతుంది. అది చెప్తేనే నేను ఈ అబ్బాయి మీదకు ఆ వాయువును వదిలా' అంటూ క్రాంతి చెప్తూ పోయాడు. ఆ మాటలు విన్న రుద్ర, హెడ్ కానిస్టేబుల్ రామస్వామి ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు. 'ఏం బాబూ.. మేం మీకు ఎలా కనిపిస్తున్నాం? లాఠీకి పని చెప్పించేలా ఉన్నావే..' అంటూ కాస్త కరువుగా అంటున్న రామస్వామిని వారించిన రుద్ర.. క్రాంతిని స్టేషన్‌కు తీసుకురమ్మని పురమాయించాడు. మరుసటి రోజు.. 'మిస్టర్ క్రాంతి. హత్య చేశానని ఒప్పేసుకొన్నావ్. అంతవరకూ ఓకే. అయితే, అసలు కారణం ఏమిటన్నది మాత్రం చెప్పకుండా ఏదేదో మాట్లాడుతున్నావ్. ఇది నీకు మంచిదికాదు' అంటూ గంభీరంగా అన్నాడు రుద్ర. 'సార్.. హత్య నేనే చేశా. అయితే, నాకు తెలియకుండానే అది జరిగిపోయింది. అసలు ఆ అబ్బాయి ఎవరో కూడా నాకు తెలియదు' క్రాంతి నిశ్చయంగా చెప్పాడు. 'తెలియని అబ్బాయిని ఎందుకు చంపావ్?' ప్రశ్నించాడు రుద్ర. 'చెప్పాను కదా సార్.. ఓ చీకటి శక్తి చెప్తేనే చేశా' మళ్లీ అదే చెప్పాడు క్రాంతి. దీంతో క్రాంతి అబద్ధమైనా చెప్తుండాలి లేదా మతి స్థిమితంగానైనా లేకుండా ఉండాలి అని రుద్ర మనసులో అనుకొంటూ ఉండగా కుర్రాడి పోస్ట్‌మార్టం రిపోర్ట్ వచ్చింది.

**సమాధానం :** క్రైమ్ స్పాట్‌కు వచ్చీరాగానే 'ఈ టైమ్‌లో ఓఆర్ఆర్‌పై ఏం చేస్తున్నారం'టూ క్రాంతిని రుద్ర ప్రశ్నించాడు. దానికి తాను ఓఆర్ఆర్ మీదుగా కారులో వెళ్తుండగా బ్యాటరీ డౌన్ కావడంతో కారు ఆగిపోయిందని క్రాంతి బదులిచ్చాడు. ఇంతలో ఎదురుగా రోడ్డు మీద జంతువు దేన్నో రక్కుతున్న శబ్దం వినిపించి కారు హెడ్‌లైట్లు ఆన్‌చేసి శవాన్ని చూసినట్టు చెప్పాడు. నిజానికి కారు బ్యాటరీ డౌన్ అయ్యాక, హెడ్‌లైట్లు కూడా ఆన్ కావు. ఈ చిన్న లాజిక్‌నే రుద్ర కనిపెట్టాడు. పక్కనే ఉన్న టోల్‌ప్లాజా నుంచి కారు దాటడం సీసీటీవీలో రికార్డు కావడంతో భవిష్యత్తులో ఈ హత్య తనమీదకు వస్తుందని భావించిన క్రాంతి.. తాను తప్పించుకోవడానికి ఏమీ తెలియనట్టు తానే పోలీసులకు సమాచారమిచ్చాడు. అయితే, కారు బ్యాటరీ డౌన్ అయిందని అబద్ధం చెప్పి దొరికిపోయాడు. కాగా.. క్రాంతి ఈ హత్యను ఎందుకు చేశాడు? ఒక్క గాయం కనిపించకుండా కుర్రాడిని ఎలా చంపాడు? దీని వెనుక కారణమేంటన్న విషయాలపై రుద్ర టీమ్ దర్యాప్తు మొదలుపెట్టింది.

# సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

**– : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.**



అనంతపురం, : ఫిబ్రవరి 13, 14, 15వ తేదీలలో సేవాఘడ్ లో నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ఫిబ్రవరి 13, 14, 15వ తేదీలలో గుత్తి మండలం సేవాఘడ్ లో నిర్వహించే సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలపై ఆయా శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. జయంతి ఉత్సవాల సందర్భంగా ఫిబ్రవరి 13 నుండి 15వ తేదీ వరకు గుంతకల్లు, గుత్తి రైల్వేస్టేషన్‌ల నుంచి సేవాఘడ్ కు ప్రత్యేక బస్సులు నడపాలని ఏపిఎస్ఆర్టిసి ఆర్ఎంకు సూచించారు. సేవాఘడ్ పరిసర ప్రాంతాలలో ముందస్తుగా మద్యాన్ని నిషేధించాలని, పోలీసు శాఖతో సమన్వయంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సేవాఘడ్‌కు వెళ్లే ప్రధాన రహదారి నుండి పొదలను తొలగించడంతోపాటు సేవాఘడ్ కు దిశా నిర్దేశం చేసే బోర్డును ఏర్పాటు చేయాలని, సేవాఘడ్ ఆలయ ప్రాంగణంలో బారికేడింగ్‌ను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ సమన్వయంతో చేయాలన్నారు. సేవాఘడ్ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లును ఫిబ్రవరి 12 లోపు పూర్తిచేయాలని, ఆలయ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచడానికి సేవాఘడ్ వద్ద 3-4 బృందాలను నియమించాలన్నారు. సేవాఘడ్ వద్ద అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయడానికి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరుగా ఏర్పాటు చేయాలని, జనరేటర్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. సేవాఘడ్ వద్ద వచ్చే భక్తులకు త్రాగునీరు, తాత్కాలిక కుళాయిలు, వాటర్ ట్యాంక్‌లను, ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్ల వద్ద పారిశుధ్యం పనులను ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ఈ విషయంలో గుంతకల్లు, గుత్తి మున్సిపల్ కమిషనర్లుతో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. బేతపల్లి, నాగసముద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సిబ్బందితో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర మందులు, 104 % డ% 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య %డ% ఆరోగ్య అధికారులకు సూచించారు. మార్గనిర్దేశం చేయడానికి మరియు దిశానిర్దేశం చేయడానికి సేవాఘడ్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.

సేవాఘడ్‌కు వచ్చే భక్తులకు ఏర్పాట్లు/సౌకర్యాలు కల్పించేందుకు ట్రస్ట్ సభ్యులు మరియు ఇతర విభాగాలతో సమన్వయం చేసుకోవాలని గిరిజన సంస్కృతిని చాటిచెప్పే ప్రదర్శన నిర్వహణకు చర్యలు తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఓ ఎ.మాలోల, ఆర్డీఓలు కేశవ నాయుడు, వసంత బాబు, ఎబివిఎస్బి శ్రీనివాస్, ఎస్డీసి శిరీష, డిపిఎం ఆనంద్, జడ్పి సిఈఓ ఆర్.రామచంద్ర రెడ్డి, సిపిఓ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిటిసి వీర్రాజు, హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, ఏపీఎస్పీడిసిల్ ఎస్ఈ సంపత్ కుమార్, సర్వే ఏడి రూప్ల నాయక్, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, ఫిషరీష్ డిడి శ్రీనివాసనాయక్, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, ఐసిడిఎస్ పిడి వనజా అక్కమ్మ, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి, డీఈవో ప్రసాద్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంత్ సేవాలాల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చలి పంజాకు గురికాకుండా



సాధారణంగానే శీతకాలంలో రోగ నిరోధక శక్తి తగ్గితుంది. మరీ ముఖ్యంగా గర్భిణులపై చలి తీవ్ర ప్రభావం చూపుతుంది. జలుబు, దగ్గుతోపాటు కీళ్లు పట్టేయడం, పొడిచర్మం వంటి సమస్యలు వారిని ఇబ్బంది పెడతాయి. కొన్ని చిన్న జాగ్రత్తలు తీసుకుంటే.. చలికాలంలో గర్భిణులు ఇబ్బంది పడకుండా ఉంటారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చలి వాతావరణం, పదేపదే మూత్రానికి వెళ్లాల్సిరావడం వల్ల.. ఈ కాలంలో గర్భిణులు నీళ్లు తక్కువగా తాగుతుంటారు. దాంతో డీహైడ్రేషన్ బారిన పడతారు. అయితే, గర్భిణుల్లో డీహైడ్రేషన్ చాలా ప్రమాదకరంగా పరిణమిస్తుంది. శరీరంలో తగినంతగా నీటి స్థాయిలు లేకపోతే.. ఉమ్మనీరు తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. ఇది బిడ్డ ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పరిస్థితి అలాగే కొనసాగితే.. ముందస్తు డెలివరీ అయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి.. ఏ కాలమైనా తగిన మోతాదులో నీళ్లు తాగడం మంచిది. ఈ కాలంలో చర్మం పొడిబారడం సహజం. ఇక గర్భిణుల్లో పొట్ట పెరిగేకొద్దీ చర్మం సాగుతూ ఉంటుంది. దాంతో చర్మం పగిలి.. ఆ ప్రదేశంలో దురద పెడుతుంది. చలికాలంలో ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. అందుకే.. వైద్యుల సూచన మేరకు ప్రత్యేక క్రీములు, లోషన్లు, నూనెలు రాసుకోవాలి. రోజుకు ఒకటి రెండుసార్లు పొట్ట భాగంలో నెమ్మదిగా మసాజ్ చేసుకోవాలి. దీనివల్ల రక్త ప్రసరణ మెరుగవడంతోపాటు చర్మం తేమగా ఉంటుంది. ప్రసవం తర్వాత స్ట్రెచ్‌మార్క్స్ రాకుండా కూడా తోడ్పడుతుంది. చలికాలంలో వేధించే మరో ప్రధాన సమస్య.. కీళ్లనొప్పులు. చలి గాలులకు శరీరంలోని రక్తనాళాలు కుంచించుకుపోయి.. రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. దాంతో కండరాలు, కీళ్లు బిగుసుకుపోతాయి. గర్భిణులను ఈ సమస్య మరింత ఎక్కువగా వేధిస్తుంటుంది. దీనినుంచి బయటపడేందుకు.. వైద్యుల సలహా మేరకు నిపుణుల ఆధ్వర్యంలో 'అరోమా థెరపీ' చేయించుకోవడం మంచిది. లావెండర్, టీ ట్రీ, యూకలిప్టస్ వంటి నూనెలతో శరీరాన్ని సున్నితంగా మసాజ్ చేయించుకోవాలి. దీనివల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. శారీరక నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

# ఫ్యాషన్ రంగవల్లిక బంజారా అల్లిక







దుస్తులంటే నాగరికత. ఆ దుస్తులే అస్తిత్వ పతాకలు. రంగులే అభిరుచుల వ్యక్తీకరణ. ఆహార్యమే గుర్తింపు, గౌరవం, వారసత్వం. అవన్నీ కోల్పోతే పరాయీకరణే. రంగురంగుల హంగులు ఉండే వస్త్రశ్రేణితో అలరించిన నిన్నటి తరం బంజారాలు.. కాల ప్రవాహంలో తమ ఆహార్యాన్ని కోల్పోయారు. ఈ నేపథ్యంలో గతించిన వైభవాన్ని తిరిగి తీసుకురావడమే కాదు.. ఆ బంజారాల వస్త్ర సౌందర్యాన్ని ఆధునిక దుస్తులకు ఆపాదిస్తున్నది బంజారా కసూతి సంస్థ. లంబాడీ మహిళలను ఆత్మన్యూనత నుంచి ఆత్మగౌరవం వైపు నడిపిస్తున్నది. తెలంగాణలో లంబాడీలు ఉన్నట్టే.. కర్ణాటకలోనూ ఉన్నారు. వీరిని లంబానీలు అని పిలుస్తారు. ప్రాంతం వేరైనా వీరి కట్టూ, బొట్టూ ఒకేలా ఉంటుంది. విజయపుర ప్రాంతంలో లంబాడీ సామాజిక వర్గానికి చెందినవాళ్లు అధిక సంఖ్యలో ఉంటారు. ఇక్కడి మహిళలు చూపు తిప్పుకోలేనంత అందమైన దుస్తులు, ఆభరణాలను నిండుగా ధరించేవారు. ఒకప్పుడు వీరి ఆహార్యం చూడగానే బంజారాలని గుర్తుపట్టేవాళ్లు. కానీ, ఇప్పుడు తలపై నుంచి జారుతూ ఉండే అద్దాల అంచుల టుక్రీ మెరుపులు లేవు. సంప్రదాయ గాగ్రీ (లెహంగా) కూడా ధరించట్లేదు. కాంక్లీ (రవిక లాంటిది), దాని పైనుంచి వేసుకునే ఆభరణాలు కూడా దాదాపు కనుమరుగయ్యాయి. గాగ్రీ బదులు చీర కట్టుకుంటున్నారు. ఒకప్పుడు వస్త్రధారణ వల్ల ప్రత్యేకంగా కనిపించే ఈ బంజారా బిడ్డలు సాధారణ ప్రజల్లో కలిసిపోయారు. అందరిలా ఉండాలన్న కోరిక వాళ్లకు లేదు. సంప్రదాయ వస్త్రధారణ పట్ల ప్రేమ తప్ప వ్యతిరేకత లేదు. వారసత్వ కళ మీద మమకారమే కానీ ఛీత్కారం లేదు. వారికి లేనిదల్లా ఉపాధే! డబ్బే అన్నిటినీ శాసిస్తున్న ఈ కాలంలో వారి జీవన సౌందర్యం కనుమరుగైపోయింది.

### కనువిందు చేసే అందాలు

చేతిలో డబ్బుల్లేని కాలం దాపురించడంతో బతుకు దెరువు కోసం కూలీనాలీ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. గూడేల్లో దర్జాగా ఉన్న బంజారా బతుకులు పట్నాల్లో పరుగులు తీయడం మొదలుపెట్టాయి. ఈ క్రమంలో వాళ్లకే సొంతమైన అల్లికలు చిక్కుల్లో పడ్డాయి. అలా మెరిసే అద్దాలు దారాల కుట్లకు దూరమయ్యాయి. రంగురంగుల అతుకులు ఆదరించేవాళ్లు లేక గతుక్కుమన్నాయి. అల్లి'కళ'కు దూరమై సంప్రదాయ వస్త్రశ్రేణిని కాదని సింథటిక్ చీరలు చుట్టుకుంటున్నారు బంజారా మహిళలు. ఆరోగ్యవంతమైన వస్త్రధారణ వదిలి రోగాల్ని అంటించే వస్త్రాలను ఆదరిస్తున్నారు. ఈ దయనీయమైన స్థితిని ఆశా పాటిల్ గుర్తించింది. విజయపురలో పుట్టిన ఆమె చిన్నప్పటి నుంచి లంబానీల దుస్తులు, వాటి ప్రత్యేకతలను ముచ్చటపడి చూస్తూ ఉండేది. కాలక్రమంలో వచ్చిన మార్పుల వల్ల లంబాడీల దుస్తులు మాయమవడం ఆమెను కలచి వేసింది. ఆ సామాజిక వర్గంలో ఎంబ్రాయిడరీ మెలకువలు తెలిసిన మహిళల్ని చేరదీసి ఆ కళను బతికించే పనికి పూనుకున్నది. బంజారా కసూతి అనే సంస్థను ప్రారంభించింది. సృజనాత్మకమైన అల్లికల్లో చేతి వృత్తుల వారి నైపుణ్యాలను, సంప్రదాయ దుస్తులను కాపాడుకోవడం ఈ సంస్థ లక్ష్యం.

### పల్లెల్లో ఫ్యాషన్ పాఠాలు

హస్తకళలు, సంస్కృతిని కాపాడుకోవడం కోసం పాటుపడితే కడుపునిండట్లేదనే హస్తకళాకారులు ఇతర వృత్తులకు మారిపోతున్నారు. ఈ రెండు పరిణామాలతో ఎన్నో హస్తకళలు అంతరించి పోతున్నాయి. అవసాన దశలో ఉన్న లంబాడీ ఎంబ్రాయిడరీ, చేనేత హస్తకళలను కాపాడుకోవాలంటే ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత కల్పించడం కూడా బంజారా కసూతి లక్ష్యంగా పెట్టుకుంది. విజయపుర సమీప గ్రామాలను ఒక యూనిట్‌గా ఆశా పాటిల్ ఎంపిక చేసుకుంది. ఆ గ్రామాల్లో అల్లిక నైపుణ్యం ఉన్న 18 మంది బంజారా మహిళలను గుర్తించింది. వారంతా కలిసి పనిచేసేందుకు, కొత్త పనులు నేర్చుకునేందుకు సిద్ధపడ్డారు. మార్కెట్‌కి అనుగుణంగా ఆధునిక దుస్తులపై లంబాడీల అల్లికల డిజైన్లు వేసేందుకు వాళ్లకు శిక్షణ ఇచ్చారు. ఎంబ్రాయిడరీలో వాళ్లకు ఉన్న నైపుణ్యంతోపాటు అందులో రాటుదేలేలా, పనిచేసేలా ప్రోత్సాహాన్ని అందించింది ఆశా. వర్క్‌షాప్‌లు నిర్వహించి ఆధునిక దుస్తులు, మార్కెట్ గురించి అవగాహన కల్పించింది. బంజారా కసూతి ప్రయాణం మొదలైన తర్వాత ఆశా పాటిల్‌తో కలిసి పనిచేసేందుకు సీమా కిశోర్ చేయి కలిపింది. ఇద్దరూ కలిసి లంబాడీ కళను, సంప్రదాయాలను కాపాడుతూ రేపటి కోసం కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు.


### అద్దాల మెరుపులెన్నో

బంజారా కసూతి లక్ష్యం నెరవేర్చేందుకు ఖాదీ, కాటన్, లినెన్, మిక్స్ ఫ్యాబ్రిక్‌లతో రూపొందించిన దుస్తులపై అల్లికల డిజైన్లను వేయించడం మొదలుపెట్టారు. సంప్రదాయ దుస్తులైన కుర్తా పైజామాల నెక్, హ్యాండ్ బార్డర్‌లపై అద్దాల మెరుపులు, రంగుల అల్లికలతో ఫ్యాషన్ మార్కెట్‌కి కొత్తందాలు పరిచయం చేశారు. చీరలు, రవికెలకు ఈ అల్లికలు మరింత సొబగుగా కుదిరాయి. ఇక పాశ్చాత్య దుస్తులపై వేసిన బంజారా కసూతి డిజైన్లకు విశేషంగా ఆదరణ లభించింది. యువత డిమాండ్‌కు అనుగుణంగా బంజారా అతివలు అద్భుతాలు చేశారు. ఈ విజయం తర్వాత వస్త్రంతో తయారుచేసిన హ్యాండ్ బ్యాగులు, కుషన్లపై కూడా బంజారా అద్దాల మెరుపులు అద్ది ఇల్లు చక్కదిద్దుకుంటున్నారు.

### ప్రౌడ్ బంజారా

చేనేత వస్త్రాలను, ఎంబ్రాయిడరీని ఈతరానికి నచ్చేలా తీర్చిదిద్దడంలో బంజారా కసూతి కృషి ఫలించింది. అనుకున్నట్టే వాళ్లకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరడంతో వేరే వ్యవసాయ పనులకు వెళ్లకుండా పూర్తిగా అల్లికలు, కుట్ల పనుల్లోనే ఉండిపోయారు ఆ మహిళలు. ఒక ప్రాంతంలో విజయవంతమైన ఈ ప్రయోగాన్ని మిగతా ప్రాంతాలకు విస్తరిస్తూ పోయారు ఆశా, సీమా. ఇప్పుడు మొత్తం అయిదు ప్రాంతాల్లో బంజారా కసూతి పని చేస్తున్నది. అరవై మంది మహిళలు ఎంబ్రాయిడరీనే జీవనాధారంగా ఎంచుకుని బతుకుతున్నారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన ఈ అల్లికను రేపటి తరం మరచిపోకుండా

# సీఎం ఎంపికలో చారిత్రక తప్పిదం



పురాతన పార్టీగా పేరున్న కాంగ్రెస్ దేశంలోని మూడు రాష్ట్రాల్లో మాత్రమే సొంతంగా అధికారంలో ఉన్నది. వాటిలో దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక ఒకటైతే, అతికష్టం మీద అధికారంలోకి వచ్చిన తెలంగాణ రెండవది. పద్నాలుగేండ్ల పాటు ఉద్యమాన్ని నడిపించి, మరో పదేండ్లు ప్రభుత్వంలో ఉన్న బీఆర్‌ఎస్‌ను కాదని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. కానీ, ఆ పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి ఎంపికలో చారిత్రక తప్పిదం చేసినట్టు కనిపిస్తున్నది. రాష్ట్రంలోని మిగతా సీనియర్ నాయకులను కాదని ఓటుకు నోటు కేసులో చిక్కుకున్న రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోపెట్టడం ఆ పార్టీ చేసిన అతి పెద్ద తప్పిదంగా మారింది. కనీసం మంత్రిగా కూడా అనుభవం లేని రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ముఖ్యమంత్రిగా ఎలాంటి మార్పులు తీసుకురాకపోగా రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల అరెస్టులు, సోషల్ మీడియా వ్యాఖ్యలపై పోలీసు కేసులు ఆ పార్టీ ప్రతిష్ఠను దిగజార్చుతున్నాయి. ముఖ్యంగా గత ప్రభుత్వంపై కక్షగట్టి కేసీఆర్, కేటీఆర్ లాంటి నాయకులపై ఉన్న కోపాన్ని తీర్చుకోవడానికి ప్రభుత్వాన్ని వాడుకుంటున్నారు. 'ఫార్ములా-ఈ' కార్ రేసు కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయాలనే ఆతృతతో ఉన్న రేవంత్‌రెడ్డి ఎంతకైనా దిగజారేందుకు ప్రయత్నిస్తున్నారు. కేటీఆర్ లాంటి నాయకుడిని అరెస్టు చేసి ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను భయపెట్టాలని చూస్తున్న ఆయన ప్రయత్నాలు ఏ మాత్రం సఫలం కావడం లేదు. ఇవన్నీ కాంగ్రెస్ పరువును దిగజార్చుతున్నాయి. ఒక జాతీయ పార్టీ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలా దిగజారడం ఇదే మొదటిసారి కావచ్చు. ఇలాగే తన వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ వైషమ్యాల కోసం ఇలాగే సమయం వృథా చేస్తే ఆ నష్టం కేవలం కాంగ్రెస్ పార్టీకే కాదు ఈ రాష్ట్ర ప్రజలకు కూడా జరుగుతుంది. ఇక తెలంగాణ ఉద్యమ చిహ్నాలను, రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలను మార్చే ఉద్దేశంతో ఉన్న ఆయన మొదట రాజముద్రను మార్చాలని ప్రయత్నించి భంగపడ్డారు. తర్వాత టీఎస్ స్థానంలో టీజీని తీసుకొచ్చారు. ఇలా పేర్లు, చిహ్నాల మార్పులపై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఆయన జాతీయస్థాయిలో బీజేపీపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటాలకు, విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన వైఖరితో జాతీయస్థాయిలో కాంగ్రెస్ పరువు పల్చనయ్యే అవకాశం ఉన్నది. ఇక, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. ఇప్పటివరకు రుణమాఫీ పూర్తికాలేదు. దానికోసం ఆశగా ఎదురు చూసిన రైతులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించి, ఇప్పుడు రూ.12వేలు మాత్రమే ఇస్తామని స్పష్టం చేశారు. ఇలా హామీలు ఇచ్చి అమలు చేయలేకపోతే రేవంత్‌రెడ్డి మాత్రమే వ్యక్తిగతంగా బాధ్యుడు కాదు, ఆ పార్టీ జాతీయ నాయకత్వం కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. లేదంటే తెలంగాణలోనే కాదు, మరే రాష్ట్రంలోనూ ప్రజలు ఆ పార్టీని నమ్మరు. అంతెందుకు మహారాష్ట్రలో కాంగ్రెస్ హామీలను ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణలో అమలు చేయని హామీలు తమకెందుకని అక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారు. హామీల అమలుపై కంటే కక్ష రాజకీయాలపై దృష్టిపెడితే ఫలితాలు ఇలాగే ఉంటాయని గ్రహించిన ఆ పార్టీ మహారాష్ట్రలో కర్ణాటక, తెలంగాణ హామీల మాట ఎత్తొద్దని నాయకులకు నిర్దేశించింది. చివరికి కాంగ్రెస్ పార్టీ జరిపిన విజయోత్సవాలకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రావడానికి సుముఖత చూపలేదంటే రేవంత్ సారథ్యంలోని ఆ పార్టీ ఏ మేరకు విజయం సాధించిందో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది కాలంలో అసలు తెలంగాణలో కనిపించదగిన మార్పేమీ రేవంత్‌రెడ్డి తీసుకురాలేకపోయారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న ఆయన ఏడాది గడుస్తున్నా ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఏదైనా జాతీయ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే మిగతా రాష్ట్రాల్లోనూ చెప్పుకొని ప్రచారం చేసుకుంటుంది. కానీ, తెలంగాణ విషయంలో మాత్రం ఆ పార్టీ జాతీయ నాయకత్వం చెప్పుకోవడానికి సంకోచిస్తున్నది. మామూలుగా కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రులను మార్చే అలవాటు ఉన్నది. కానీ, ఎదురుచూసి నిర్ణయం తీసుకుందామన్న ఆలోచనలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి రేవంత్ దూకుడు మనస్తత్వం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. అధిష్ఠానం సూచనలను తెలంగాణ పాలకులు ఏ మాత్రం పట్టించుకోవట్లేదన్న విమర్శలున్నాయి. మిగతా నాయకులతో అంటీముట్టనట్టు వ్యవహరించడం వల్ల ఆయనపై అధిష్ఠానం గతంలో సీరియస్ అయిన విషయం అందరికీ తెలిసిందే. రూ.15 వేల రైతు భరోసాపై వెనక్కి తగ్గడంపై క్యాబినెట్ సహచరుల సూచనలను ఆయన పట్టించుకున్నట్టు కనిపించలేదు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పుకొంటున్న రేవంత్‌రెడ్డికి ప్రతిపక్షాలు చేస్తున్న పోరాటాలకు ప్రజల మద్దతు విశేష స్థాయిలో ఎందుకు ఉంటుందన్న విషయాన్ని గ్రహించడం లేదు. లగచర్ల సహా ప్రతిపక్షాలు చేసే ఏ పోరాటాలకైనా ప్రజలు భారీగా మద్దతునిస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఆమె అమలుచేసిన సం క్షేమ పథకాలా? లేదంటే ఆమె విధించిన ఎమర్జెన్సీ నా? అన్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచించుకోవాలి. తెలంగాణలో ఎలాగూ విశ్వాసం కోల్పోయింది. ఇప్పటికైనా తెలంగాణలోని నాయకత్వానికి కాంగ్రెస్ అధిష్ఠానం సరైన మార్గ నిర్దేశం చేయకపోతే మిగతా రాష్ట్రాల్లోనూ ఆ పార్టీకి అదే గతి పదు తుంది. ఇందులో అనుమానం లేదు.

# మీ కాళ్లు బలహీనంగా ఉన్నాయా వీటిని తినండి.. దృఢంగా మారుతాయి



శరీరంలోని అన్ని అవయవాలు బలంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ప్రతి ఒక్క అవయవం ఆరోగ్యంగా, దృఢంగా ఉంటేనే శరీరం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ క్రమంలోనే కొందరు శరీరం ఎంత దృఢంగా ఉన్నప్పటికీ కాళ్లు బలహీనంగా ఉంటాయి. అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా ఉంటుంది. అలాగే కండరాల నిర్మాణం కూడా సరిగ్గా ఉండదు. దీంతో పాదాల నొప్పులు వస్తుంటాయి. అయితే సరైన ఆహారం తీసుకుంటే శరీరంలోని అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయి. కాళ్లు ఆరోగ్యంగా ఉండి కండరాల నిర్మాణం జరగాలంటే ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. పలు ఆహారాలను తరచూ తీసుకోవడం వల్ల కాళ్లను దృఢంగా ఉంచుకోవచ్చు. కాళ్లలో ఉండే కండరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. ఇక అందుకు ఏమేం ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.

### చికెన్..

చికెన్‌ను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. అయితే చికెన్‌లో లెగ్ పీస్‌లను తింటుంటారు. ప్రోటీన్లు కావాలంటే చికెన్ బ్రెస్ట్ పీస్‌లను తినాలి. లెగ్ పీస్‌లకు కొవ్వు బాగా ఉంటుంది. కనుక లెగ్ పీస్‌లను తినకూడదు. బ్రెస్ట్ పీస్‌లలో ప్రోటీన్లు ఉంటాయి. కనుక బ్రెస్ట్ పీస్‌లను తింటే కండరాలకు బలం కలుగుతుంది. ముఖ్యంగా కాళ్లలో ఉండే కండరాలు నిర్మాణం అవుతాయి. కండరాలు దృఢంగా మారుతాయి. అదేవిధంగా పెరుగును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. దీంతోపాటు కండరాలకు బలం కలుగుతుంది. పెరుగును తింటున్నా కూడా కాళ్లు బలంగా మారుతాయి. ఆరోగ్యంగా ఉంటాయి. పెరుగులో ఉండే ప్రొబయోటిక్ ఆహారాలు, ప్రోటీన్లు కండరాలకు మేలు చేస్తాయి. కనుక పెరుగును రోజూ తినాలి.


### పనీర్..

పనీర్‌ను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. పనీర్ ద్వారా మనకు ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. దీంతో కండరాల నిర్మాణం జరుగుతుంది. కాళ్లు బలహీనంగా ఉన్నవారు పనీర్ ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కాళ్లలోని కండరాలు దృఢంగా మారుతాయి. కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే పాలకూరను తినడం వల్ల కూడా కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. దీని వల్ల శరీరానికి కావల్సిన క్యాల్షియం లభించడంతోపాటు ప్రోటీన్లు కూడా అందుతాయి. దీంతో కాళ్లు దృఢంగా మారుతాయి. అలాగే కాళ్లు బలంగా మారాలంటే చిలగడదుంపలను కూడా తినవచ్చు. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావల్సిన ప్రోటీన్లను, శక్తిని అందిస్తాయి.

### చియా విత్తనాలు..

ఇక సముద్రపు చేపలను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు ఈ చేపలను తింటే మంచిది. దీంతో మన శరీరానికి కావల్సిన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి కండరాల నిర్మాణానికి ఎంతగానో దోహదం చేస్తాయి. దీంతో కాళ్లు దృఢంగా, ఆరోగ్యంగా మారుతాయి. అలాగే క్వినోవాను కూడా తినవచ్చు. ఇవి శరీరానికి ఎంతో శక్తిని అందిస్తాయి. కండరాలు నిర్మాణం అయ్యేలా చేస్తాయి. ప్రోటీన్లను అందిస్తాయి. దీని వల్ల కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అదేవిధంగా చియా విత్తనాలను కూడా తినవచ్చు. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావల్సిన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి కాళ్లను బలంగా మారుస్తాయి. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల కాళ్లు బలంగా మారుతాయి. శరీరానికి కూడా శక్తి లభిస్తుంది.

# రాత్రి భోజనం అనంతరం కడుపు ఉబ్బరంగా ఉంటుందా అయితే అందుకు కారణాలు ఇవే



ప్రస్తుత తరుణంలో జీర్ణ సమస్యలు అనేవి చాలా మందికి కామన్ అయిపోయాయి. అప్పుడే పుట్టిన శిశువులు కూడా జీర్ణ సమస్యల బారిన పడుతున్నారు. గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం, మలబద్దకం, గుండెల్లో మంటగా అనిపించడం.. ఇలాంటివన్నీ జీర్ణ సమస్యలుగా చెప్పవచ్చు. అయితే వీటిల్లో ఒకటి వచ్చిందంటే మిగిలినవి కూడా ఆటోమేటిగ్గా వచ్చేస్తాయి. కనుక ఏ జీర్ణ సమస్య వచ్చినా దాన్ని తగ్గించుకోవాలి. లేదంటే సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. ఇక చాలా మందికి రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కడుపు ఉబ్బరంగా ఉంటుంది. దీంతోపాటు ఇతర జీర్ణ సమస్యలు కూడా వస్తుంటాయి. అయితే ఇందుకు పలు ప్రధాన కారణాలు ఉంటాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

### కొవ్వు పదార్థాలను తినడం..

రాత్రి పూట చాలా మంది కొవ్వు పదార్థాలను తింటుంటారు. అయితే వీటిని రాత్రి పూట తినకూడదు. రాత్రి భోజనంలో కొవ్వు పదార్థాలను తింటే అవి సరిగ్గా జీర్ణం కావు. పేగుల్లో కదలికలు సరిగ్గా ఉండవు. జీర్ణాశయంలోనే కొవ్వు పదార్థాలు ఎక్కువ సమయం పాటు ఉంటాయి. ఇలా దీర్ఘకాలంలో రాత్రి పూట కొవ్వు పదార్థాలను తినడం వల్ల కడుపు ఉబ్బరం వస్తుంది. దీన్ని అజీర్తి కారణంగా వచ్చిన కడుపు ఉబ్బరం అని చెప్పవచ్చు. ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే ఈరకంగా కడుపు ఉబ్బరం వస్తుంది. ఇక కొందరికి పాలు లేదా పాల ఉత్పత్తులు పడవు. పాలలో ఉండే లాక్టోజ్ అనే పదార్థం కారణంగా ఆయా ఉత్పత్తులను తీసుకున్నప్పుడు సరిగ్గా జీర్ణం కావు. ఇవి గ్యాస్ ట్రబుల్ ను కలగజేస్తాయి. దీంతో కడుపు ఉబ్బరం వస్తుంది. మీరు పాలు లేదా పాల ఉత్పత్తులను తీసుకున్నప్పుడు కడుపు ఉబ్బరం వస్తుంటే వాటి వల్లే ఆ సమస్య వస్తుందని గమనించాలి.

### ఫైబర్‌ను తీసుకోవడం..

కొందరికి ఫైబర్ ఉండే ఆహారాలను తీసుకుంటే పడదు. అజీర్తి, గ్యాస్ ఏర్పడుతాయి. దీంతో కడుపు ఉబ్బరం వస్తుంది. ఫైబర్ ఉన్న ఆహారాలను తీసుకుంటే కడుపు ఉబ్బరం ఏర్పడితే ఆయా ఆహారాలను తీసుకోవడం తగ్గించాలి. లేదా పూర్తిగా మానేయాలి. దీంతో సమస్య నుంచి బయట పడవచ్చు. అలాగే శీతల పానీయాలు, సోడాలను తాగడం వల్ల కూడా కొందరికి పడవు. ఫలితంగా గ్యాస్ ట్రబుల్ సమస్య ఏర్పడుతుంది. ఇది పొట్ట ఉబ్బరాన్ని కలగజేస్తుంది. అదేవిధంగా సోడియం అధికంగా ఉండే ఆహారాలను తింటున్నా కూడా సరిగ్గా జీర్ణం అవకపోతే గ్యాస్ ఏర్పడి పొట్టలో ఉబ్బరం వస్తుంది. దీంతోపాటు ఇతర జీర్ణ సమస్యలు కూడా వస్తాయి.

### అతిగా భోజనం చేయడం..

కొందరు అతిగా భోజనం చేస్తుంటారు. రాత్రిపూట సహజంగానే వారు ఎక్కువ ఆహారం తింటుంటారు. అయితే ఇలా చేయడం మంచిది కాదు. ఇది గ్యాస్, అజీర్తిని కలగజేస్తుంది. దీంతో కడుపు ఉబ్బరం కూడా వస్తుంది. రాత్రి పూట తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తినాలి. అలాగే వీలైనంత త్వరగా భోజనం చేయాలి. ఇలా పలు సూచనలు పాటిస్తూ ఆయా ఆహారాలను తీసుకోవడం మానేస్తే కడుపు ఉబ్బరం సమస్య నుంచి బయట పడవచ్చు. భోజనం చేసిన అనంతరం సోంపు గింజలను తింటుంటే కడుపు ఉబ్బరం నుంచి బయట పడవచ్చు. దీంతో గ్యాస్ సమస్య కూడా తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

# మేక్‌మైట్రిప్ ప్రత్యేక ఆఫర్

**ఇంటర్నేషనల్ టికెట్లపై విడతలవారీగా చెల్లింపులు**



రవాణా సదుపాయాలు సమకూరుస్తున్న మేక్‌మైట్రిప్..కస్టమర్లను ఆకట్టుకోవడానికి వినూత్న ఆఫర్‌ను తెరపైకి తీసుకొచ్చింది. అంతర్జాతీయ ప్రయాణికులను ఆకట్టుకోవడంలో భాగంగా తమ ముందస్తు విమాన టికెట్ బుకింగ్ చేసుకున్నవారు ఒకేసారి చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదని, విడతలవారీగా చెల్లిస్తే సరిపోతున్నదని వెల్లడించింది. ముందస్తు బుకింగ్ చేసుకున్న సమయంలో విమాన టికెట్ చార్జిలో 10 శాతం నుంచి 40 శాతం మధ్యలో చెల్లిస్తే సరిపోతున్నదని, మిగతాది ప్రయాణానికంటే ముందు లేదా బుకింగ్ చేసుకున్న నాటినుంచి 45 రోజులు ఏది ముందువస్తే ఆ రోజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించింది. ఈ ఆఫర్‌ను ఎంచుకున్నవారు ఎలాంటి అదనపు చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదని పేర్కొంది. విమానయాన రంగంలో ఇలాంటి ఫీచర్ ప్రవేశపెట్టడం ఇదే తొలిసారని, ప్రయాణికులు తమ అంతర్జాతీయ రూట్లకోసం ఒకేసారి చెల్లింపులు జరుపాల్సి వస్తుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వీరికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ స్కీంను ప్రవేశపెట్టినట్లు మేక్‌మైట్రిప్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి సౌజన్య శ్రీవాత్సవ తెలిపారు. ముఖ్యంగా అతిపెద్ద కుటుంబాలు లేదా గ్రూపులు తమ అంతర్జాతీయ బుకింగ్‌లపై ఒకేసారి మొత్తం చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ కొత్త స్కీంతో వీరికి ప్రయోజనాలు కలుగనున్నాయన్నారు. ఎక్కువ మంది భారతీయులను అంతర్జాతీయ విమానాల బుకింగ్ చేసుకునేందుకు వీలుగా ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ స్కీంనకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించిందని, ఒంటరిగా, జంటలు, కుటుంబాలు అంతర్జాతీయ రూట్లలో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదన్నారు.

# బిగ్ సి లో సంక్రాంతి ఆఫర్లు




సంక్రాంతి ఆఫర్లను ఆవిష్కరిస్తున్న బిగ్ 'సి' సంస్థ ఫౌండర్ మరియు సి.యం.డి. శ్రీ యం. బాలు చౌదరి

ప్రముఖ మొబైల్ రిటైల్ దిగ్గజం బిగ్''సి'.. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని ఆకర్షణీయమైన ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి మాట్లాడుతూ.. ఈ సంక్రాంతి సందర్భంగా ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10 వేల వరకు మొబైల్ ప్రొటెక్షన్‌తోపాటు రూ.5,999 విలువైన స్మార్ట్‌వాచ్, రూ.1,799 విలువైన ఎయిర్‌బడ్స్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఇటీవల మార్కెట్లోకి వచ్చిన ఒప్పో రెనో 13 మొబైల్ కొనుగోళ్లపై రూ.7,990 విలువ కలిగిన స్విస్ మిలిటరీ స్పీకర్‌తోపాటు ఏడాదిపాటు మొబైల్ ప్రొటెక్షన్, రూ.5 వేల వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌ను కూడా అందిస్తున్నట్లు చెప్పారు.

**స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.15 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్**

**బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం డిస్కౌంట్**

**వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే మొబైల్ కొనుగోలు అవకాశం**

**ఐఫోన్ మొబైల్‌పై రూ.5 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్**

**వివో-ఒప్పో మొబైళ్ల కొనుగోలుపై 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్**

**వన్‌ప్లస్, రియల్‌మీ మొబైళ్లపై రూ.3 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్**

**ఎంఐ మొబైళ్లపై రూ.5 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్**

**ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా మొబైళ్లు, స్మార్ట్‌టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలను కొనుగోలు చేయవచ్చును.**

# ఉన్నట్టుండి పెరిగిన బంగారం ధర సడన్ షాక్ ఇచ్చిందిగా



గతేడాది బంగారం ధరలు కాస్త తగ్గుతూ వచ్చాయి. దీంతో మహిళలతో పాటు గోల్డ్ లవర్స్ కొనుగోళ్లకు చాలా ఆసక్తి చూపించారు. కొత్త ఏడాది పసిడి మరింత దిగొస్తుందని భావించారు. కొని దాచుకోవాలని భావించారు. మ్యారేజ్ సీజన్ సమయంలో ధరలు కొండెక్కుతాయి కాబట్టి ఇప్పుడే కొనేస్తే బెటర్ అని భావించారు. కానీ పసిడి తగ్గేదేలే అంటూ పరుగులు పెడుతోంది. కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి కూడా గోల్డ్ రేట్స్ భారీగా పెరుగుతూ వస్తున్నాయి. ఇవాళ కూడా ధరలు పెరిగాయి. ఉన్నట్టుండి ఒక్కసారిగా కొండెక్కింది గోల్డ్. ప్రస్తుతం బంగారం ధరలు ఎంత ఉన్నాయి? గోల్డ్ రేట్స్ పెరగడానికి గల కారణాలు ఏంటి? అనేది ఇప్పుడు మనం చూద్దాం..

### గోల్డ్ పైకి.. సిల్వర్ కిందకు..!

నాల్రోజుల తర్వాత గోల్డ్ రేట్స్ స్వల్పంగా పెరిగాయి. హైదరాబాద్‌లో జనవరి 9, గురువారం ఉదయం చూసుకుంటే.. 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.100 పెరిగి.. రూ.72 వేల 250 దగ్గరకు చేరింది. అదే 24 క్యారెట్ల స్వచ్ఛమైన పసిడి రేటు రూ.110 పెరిగి తులం రూ.78 వేల 820 పలుకుతోంది. తగ్గుతూ పోతున్న గోల్డ్ మళ్లీ ఊపందుకోవడానికి అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులే కారణమని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక, బంగారం ధరలు పెరిగినా.. వెండి మాత్రం స్థిరంగా కొనసాగుతూ సిల్వర్ లవర్స్‌ను ఆకర్షిస్తోంది. ఇవాళ హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,00,000 వద్ద ట్రేడింగ్ అవుతోంది. పైన పేర్కొన్న పసిడి, వెండి ధరలు గురువారం పొద్దున 7 గంటల టైమ్‌లో ఉన్నవి. వీటి ధరల్లో ఒక్కోసారి మధ్యాహ్నానికే మార్పులు రావొచ్చు. కాబట్టి స్థానికంగా రేట్లు తెలుసుకోవడం మంచిది.

# కాస్త.. రిటర్న్ చూడు గురూ!



### పైసల ముచ్చట్లు

కాలం కన్నా వేగంగా మనిషి జీవితంతో ఆడుకుంటున్న వస్తువు ఏదైనా ఉందంటే.. అది డబ్బే! గుండె కూడా లబ్''డబ్బు' అంటూ నిమిషానికి అరవై కన్నా ఎక్కువసార్లు కొట్టుకుంటుందంటే మనిషికి మనీకి సంబంధం ఎంత స్ట్రాంగో అర్థం చేసుకోవచ్చు. అయితే బతకడానికి డబ్బు కావాలే కానీ, డబ్బే బతుకు కాకూడదు. ఈ సూక్ష్మాన్ని గ్రహించ లేక కొందరు కాసుల వేటలో జీవిత కాలాన్ని కరిగించేసుకుంటారు. ఈ సత్యాన్ని గుర్తించలేక కాణీ సంపాదించకుండా కాలాన్ని భారంగా గడిపేవాళ్లూ ఉంటారు.కానీ, ఈ రెండు వైఖరులూ తప్పే! మన పెట్టుబడి కాలానుగుణంగా వృద్ధి సాధించాలి. అందుకు ఏం చేయాలో? ఈ కొత్త సంవత్సరంలో ఎలా ముందుకు వెళ్లాలో తెలుసుకుందాం.. మనిషి సంపాదనకు గ్యారెంటీ లేదు. జీతభత్యాలు, వ్యాపారంలో లాభాలు పెరిగినంత కాలం ఏ ఇబ్బందీ ఉండదు. కానీ, పరిస్థితులు తారుమారైనప్పుడే డబ్బు విలువ తెలుస్తుంది. రూపాయిని కంటిపాప కన్నా జాగ్రత్తగా చూసుకుంటూ విలువైన జీవితాన్ని కోల్పోతున్నవారు ఎందరో ఉన్నారు. ఎంత కూడబెట్టినా.. ఇంకా ఇంకా సంపాదించాలని పరుగులు తీస్తుంటారు. రాబడి కోసం జీవితాన్ని త్యాగం చేసుకోవద్దు. మనం సంపాదించిన రూపాయి మన కోసం పనిచేసేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. అంటే.. మనం పొదుపు, మదుపు చేసిన రూపాయి.. మన జీవితాన్ని కుదుపులకు గురికాకుండా అదుపు చేయగలగాలి. అలా జరగాలంటే దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆశించి ఇన్వెస్ట్‌మెంట్ చేయాలి. అంతేకానీ, క్విక్‌మనీ రేస్‌లో అదృష్టం పరీక్షించుకుంటానంటే కుదరదు.

### ద్రవ్యోల్బణం కొలమానం

రాబోయే లాభాలను దృష్టిలో ఉంచుకొనే ఇన్వెస్ట్ చేస్తారు. నష్టాలు వస్తాయని చెబితే ఎవరూ ఇన్వెస్ట్ చేయరు కదా! లాభం వస్తుందని నమ్మకం ఉంటేనే ముందుకొస్తారు. కానీ, ఆ రిటర్న్ ఎంతన్నది ప్రధానం. మనదేశంలో ద్రవ్యోల్బణం సుమారు ఏడు శాతంగా ఉంటున్నది. అంటే నిత్యావసరాల ధరల్లో ఏటా ఏడు శాతం పెరుగుదల కనిపిస్తుందన్నమాట! ఇంకా చెప్పాలంటే మన ఖర్చులు ప్రతి సంవత్సరం రమారమి ఏడు శాతం పెరుగుతాయి. ఈ మేరకు మన పెట్టుబడిపై వచ్చే రిటర్న్ ఏడు శాతంగానే ఉందనుకోండి.. అప్పుడు మీకు వచ్చే లాభశాతం సున్నా! ద్రవ్యోల్బణం కన్నా తక్కువ శాతం రిటర్న్ వచ్చే ఇన్వెస్ట్‌మెంట్ వల్ల మీ డబ్బు కరిగిపోతుంది తప్ప.. పెరగదు. అందుకే, మన ఇన్వెస్ట్‌మెంట్‌పై వచ్చే రిటర్న్ ఏడు శాతం కన్నా ఎక్కువగా ఉన్నప్పుడే అది మేలైన పెట్టుబడి అవుతుంది. అప్పుడే మీ రూపాయి మరో రూపాయిని సంపాదిస్తున్నట్టుగా భావించాలి. దీర్ఘకాలం పెట్టుబడి అయితే మ్యూచువల్ ఫండ్స్ మంచి ఎంపిక. కనీసం 14 శాతం రిటర్న్ ఇక్కడ పొందే వెసులుబాటు ఉంటుంది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ మీద ఇన్వెస్ట్ చేసినా మంచిదే! ప్రతినెలా అద్దె రూపంలో ఆదాయం వస్తుంది! నెలవారీగా ఎలాంటి ఆదాయాన్ని ఇవ్వని స్థలం కన్నా అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తీసుకోవడం మంచి పద్ధతి. బంగారం మీద ఇన్వెస్ట్‌మెంట్ కూడా 12 శాతం వరకు రిటర్న్ ఇస్తుంది. అయితే బంగారాన్ని బిస్కెట్ రూపంలో, బాండ్ రూపంలో కాకుండా.. ఆభరణాల రూపంలో కొనుగోలు చేయడం అవసరం. ఆ నగలను మీ ఇంట్లోవాళ్లు ధరించినప్పుడు వాళ్లు పొందే ఆనందాన్ని వెలకట్టలేం కదా! ఇలా రకరకాల రూపంలో ఇన్వెస్ట్ చేసి లాభాలు ఆర్జించొచ్చు.

### బీమా తర్వాతే ఏదైనా..

మీ జీవన సౌధానికి హెల్త్ ఇన్సూరెన్స్ పిల్లర్స్ లాంటివి. ఆ తర్వాత మీరు చేసే పెట్టుబడులు స్లాబుల్లాంటివి. పిల్లర్స్ లేకుండా ఎన్ని అంతస్తులు కడితే మాత్రం ఏం ప్రయోజనం? ఒక్క కుదుపుతోనే మీ జీవితం కుప్పకూలిపోతుంది. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి, మధ్యతరగతి, సగటు ఉద్యోగి అందరూ ఆరోగ్య బీమా కాన్సెప్ట్‌ను లోతుగా అర్థం చేసుకోవాలి. పాతికేండ్ల తర్వాత వైద్యానికయ్యే ఖర్చులను అంచనా వేసి.. ఆ మొత్తానికి ఇన్సూరెన్స్ తీసుకోవాలి. ముందుగా హెల్త్ ఇన్సూరెన్స్, తర్వాత కుటుంబ వ్యవహారానికయ్యే ఖర్చులు ఆ తర్వాతే ఇన్వెస్ట్‌మెంట్ గురించి ఆలోచించాలి. లేకపోతే ఊహించని ప్రమాదం జరిగి ఆస్పత్రిపాలైనా, దీర్ఘకాలిక వ్యాధిబారిన పడినా.. మీ కుటుంబం ఆర్థికంగా ఇరవై ఏండ్లు వెనకబడిపోతుందని గుర్తుంచుకోండి. కుటుంబసభ్యులు నలుగురు ఉన్నట్టయితే.. కోటి నుంచి కోటిన్నర రూపాయల హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం అవసరం. ఆరోగ్య బీమా విషయంలో పెద్దగా ఆలోచించి.. ఎక్కువ మొత్తానికి తీసుకుంటే మీ భవిష్యత్తుకు భరోసా ఇచ్చినవారు అవుతారు!

# మార్కెట్లను ముంచిన జీడీపీ



### తీవ్ర ఊగిసలాటల మధ్య నష్టపోయిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ నాలుగేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోనున్నదని కేంద్ర ప్రభుత్వం అంచనాలను విడుదల చేయడం మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు చివరకు నష్టాల్లో ముగిశాయి. కార్పొరేట్ల మూడో త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు కూడా ప్రారంభంకానుండటం కూడా మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధుల ఉపసంహరణ కొనసాగుతుండటం, రూపాయి మరింత బలహీనపడటం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 50.62 పాయింట్లు కోల్పోయి 78,148.49 వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ 18.95 పాయింట్లు కోల్పోయి 23,688.95 వద్ద నిలిచింది. దేశ ఆర్థిక వ్యవస్థ నెమ్మదించనుండటం, క్యూ3లో కార్పొరేట్లు నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించే అవకాశాలుండటం మార్కెట్లో తీవ్ర ఆటుపోటులకు లోనయ్యాయని, చివర్లో బ్లూచిప్ సంస్థల నుంచి లభించిన మద్దతుతో భారీ నష్టాల నుంచి కోలుకున్నాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. అమెరికా బాండ్ ఈల్డ్‌లు పెరుగుతుండటం, ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు సన్నగిల్లడం కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. 30 షేర్ల ఇండెక్స్‌లో అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్‌అండ్‌టీ, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. కానీ, టీసీఎస్, రిలయన్స్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్, మారుతి లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 1.12 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.08 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.86 శాతం నష్టపోగా, క్యాపిటల్ గూడ్స్ 1.34 శాతం, సర్వీసెస్ 1.26 శాతం, పవర్ 1.17 శాతం, యుటిలిటీ రంగ షేర్లు కుదేలవగా..ఎనర్జీ, ఐటీ, ఆయిల్‌అండ్‌గ్యాస్, రియల్టీ, టెక్, ఐటీ రంగ సూచీలు లాభాల్లో ముగిశాయి.

### స్టాండర్డ్ గ్లాస్ ఐపీవో 182 రెట్ల బిడ్డింగ్‌లు

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ ఐపీవోకి అపూర్వ స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 182.57 రెట్ల అధిక బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. రూ.410 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి సంస్థ జారీ చేసిన 2,08,29,567 షేర్లకుగాను 3,80,27,59,991 షేర్ల బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ విభాగం నుంచి అత్యధికంగా 327 రెట్ల సబ్‌స్క్రిప్షన్ కాగా, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ 275 రెట్లు, రిటైల్ విభాగం 64 రెట్లు అధికంగా బిడ్లు వచ్చాయి. సోమవారం ప్రారంభమైన ఈ వాటా విక్రయం బుధవారం ముగిసింది. ఇష్యూ సైజ్ రూ.133-140 మధ్యలో నిర్ణయించింది.

### రూపాయి కకావికలం

రూపాయి కకావికలమైంది. వరుసగా రెండోరోజు బుధవారం ఒకేరోజు 17 పైసలు పడిపోయి చారిత్రక కనిష్ఠ స్థాయి 85.91కి పడిపోయింది. అమెరికా కరెన్సీ డాలర్ మరింత బలోపేతం కావడం, క్రూడాయిల్ ధరలు భగ్గుమండటం వల్లనే రూపాయి భారీగా పతనమైంది.

# 2030 నాటికి 17 కోట్ల కొత్త జాబ్స్ ఫ్యూచర్ జాబ్స్ నివేదికలో



వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ కూడా 'ఫ్యూచర్ జాబ్స్ రిపోర్ట్-2025'లో కీలక విషయాలను ప్రకటించింది. ఈ నేపథ్యంలో 2030 నాటికి 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయని తెలిపింది. దీంతోపాటు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి రావచ్చని వెల్లడించింది. ఆ వివరాలేంటో ఇక్కడ తెలుసుకుందాం. కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తాజా ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ నివేదిక ప్రకారం భారతీయ కంపెనీలు ఏఐ, రోబోటిక్స్, ఎనర్జీ టెక్నాలజీల వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

### ఏ ఉద్యోగాలు హిట్

నివేదిక ప్రకారం 35% భారతీయ కంపెనీలు సెమీకండక్టర్లు, కంప్యూటింగ్ టెక్నాలజీ తమ వ్యాపారాన్ని పూర్తిగా మార్చగలవని విశ్వసిస్తున్నాయి. అయితే ఈ సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 20% మాత్రమే. అదేవిధంగా 21% భారతీయ యజమానులు క్వాంటం, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని ముఖ్యమైనవిగా భావిస్తారు, ఇది ప్రపంచంలోని 12%గానే ఉంది. బిగ్ డేటా, మెషీన్ లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు భారతదేశంలో వేగంగా వృద్ధి చెందుతాయని తెలిపింది. ఇవి భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ట్రెండ్‌లకు సరిపోతాయని చెప్పింది. టాలెంట్ కొరతను ఎదుర్కొనేందుకు భారతీయ కంపెనీలు కొత్త పద్ధతులను అవలంబిస్తున్నాయని ప్రస్తావించింది.

### భారతదేశంలో నైపుణ్యాలకు డిమాండ్

67% కంపెనీలు కొత్త, విభిన్న టాలెంట్ పూల్స్‌పై దృష్టి సారిస్తున్నాయి. 30% కంపెనీలు డిగ్రీ షరతును తొలగించి నైపుణ్యాలకు ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ గణాంకాలు వరుసగా 47%, 19%గా ఉన్నాయి. నైపుణ్యాల డిమాండ్‌లో భారతదేశం, అమెరికా అగ్రస్థానంలో ఉన్నాయి. కానీ వ్యత్యాసం ఏమిటంటే అమెరికాలో ప్రజలు దాని అధ్యయనంపై ఆసక్తి చూపుతున్నారు. అయితే భారతదేశంలో కార్పొరేట్ కంపెనీలు తమ ఉద్యోగులకు నేర్పించడానికి పెట్టుబడి పెడుతున్నాయి.

### 2030 నాటికి భారతదేశంలో ఏమి మారుతుంది?

2030 నాటికి డిజిటల్ టెక్నాలజీల విస్తరణ, వాతావరణ చర్యలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారతదేశంలో ఉద్యోగాలను పునర్నిర్మించగలవని నివేదిక సూచిస్తుంది. ఇది కాకుండా భారతదేశ యువత జనాభాకు ప్రధాన సహకారం ఉంటుంది. నివేదిక ప్రకారం రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ శ్రామిక శక్తిలో మూడింట రెండు వంతుల మంది భారతదేశం, ఆఫ్రికా వంటి ప్రాంతాల నుంచి ఉంటారు.

### ప్రపంచంలో ఉద్యోగాల పరిస్థితి

నివేదిక ప్రకారం 2030 నాటికి 170 మిలియన్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయి. ఇదే సమయంలో 92 మిలియన్ల ఉద్యోగాలు కూడా కోల్పోతారు. అంటే 78 మిలియన్ల కొత్త ఉద్యోగాలు వచ్చే ఛాన్సుంది. కొత్త ఉద్యోగాలలో రైతులు, డెలివరీ డ్రైవర్లు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు వంటి జాబ్స్ ఉంటాయి. అదే సమయంలో కారణంగా క్యాషియర్, అడ్మిన్ అసిస్టెంట్ వంటి జాబ్స్ తగ్గుతాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్న 40% నైపుణ్యాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని నివేదిక పేర్కొంది. 63% మంది యజమానులు తమ వ్యాపారాన్ని మార్చడానికి ఇదే అతిపెద్ద అడ్డంకిగా భావిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త టెక్నాలజీలు, నైపుణ్యాలను అలవర్చుకోవడానికి సిద్ధంగా ఉన్న వారికే భవిష్యత్‌లో ఉద్యోగాలు ఉంటాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఈ రేసులో భారత్ చేరడమే కాకుండా అనేక విధాలుగా ముందుందని తెలిపింది.

# టీసీఎస్ లాభం 12,380 కోట్లు

దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.12,380 కోట్ల నికర లాభం ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.11,058 కోట్ల లాభంతో పోలిస్తే 11.95 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.6 శాతం ఎగబాకి రూ. 60,583 కోట్ల నుంచి రూ.63,973 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన రూ.64,259 కోట్లతో పోలిస్తే భారీగా తగ్గింది. గత త్రైమాసికంలో కొత్తగా 10.2 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివాసన్ తెలిపారు.

సంస్థకు భారత్ నుంచి సమకూరిన ఆదాయంలో 70 శాతం పెరుగుదల నమోదైంది. మొత్తం ఆదాయంలో ఈ వాటా 9 శాతంగా ఉన్నది.

గత త్రైమాసికంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల నుంచి 3.2 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు లభించాయి.

గత మూడు నెలల్లో సంస్థ నుంచి 5 వేల మంది సిబ్బంది వెళ్లిపోయారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 6.07 లక్షలుగా ఉన్నారు.

ఉద్యోగుల వలసలు 13 శాతంగా నమోదయ్యాయి.

ఈ ఏడాది కొత్తగా క్యాంపస్‌ల నుంచి 40 వేల మందిని నియమించుకోనున్న సంస్థ..వచ్చే ఏడాది దీనికంటే అధికంగా రిక్రూట్ చేసుకోనున్నది.

ప్రస్తుత సంవత్సరానికిగాను ప్రతిషేరుకు రూ.66 ప్రత్యేక డివిడెండ్‌ను కలుపుకొని మొత్తంగా రూ.76 డివిడెండ్‌ను చెల్లించనున్నది.

## నష్టాల్లోనే దేశీయ స్టాక్ మార్కెట్లు

# 528 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలతో పాటు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, కార్పొరేట్ కంపెనీలు త్రైమాసిక ఫలితాల ప్రకటనల నేపథ్యంలో మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 78,206.21 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటిక సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 78,206.21 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. ఒక దశలో 77,542.92 పాయింట్ల కనిష్ఠానికి పతనమైంది. చివరకు స్వల్పంగా కోలుకుంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి 528.28 పాయింట్లు పతనమై.. 77,620.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 162.45 పాయింట్లు తగ్గి 23,526.50 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దాదాపు 1,175 లాభపడగా.. మరో 2,610 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఓఎన్‌జీసీ, టాటా స్టీల్, కోల్ ఇండియా, బీపీసీఎల్ నష్టపోయాయి. హెచ్‌యూఎల్, బ్రిటానియా ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, ఎంఅండ్‌ఎం, బజాజ్ ఆటో లాభపడ్డాయి. ఎఫ్‌ఎంసీజీ మినహా మిగతా అన్ని సూచీలు.. ఐటీ, మెటల్, గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, పవర్, రియాల్టీ ఒకటి నుంచి రెండుశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు తగ్గుముఖం పట్టాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 85.86 వద్ద ఉన్నది.

## వారాంతంలో కూడా భారీ నష్టాలు

# ఆల్‌టైం కనిష్టానికి రూపాయి



దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో (జనవరి 10న) భారీ నష్టాలతో ముగిశాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 241 పాయింట్లు పడిపోయి 77,378.62 వద్దకు చేరుకోగా, నిఫ్టీ 95 పాయింట్లు తగ్గిపోయి 23,431కు చేరింది. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ 769 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ 1160 పాయింట్లు పతనమయ్యాయి. దీంతో మదుపర్లు ఒక్కరోజులోనే లక్షల కోట్ల రూపాయలను నష్టపోయారు. మధ్యాహ్నం 3 గంటలకు 779 షేర్లు పురోగమించగా, 3,173 షేర్లు క్షీణించాయి. 93 షేర్లు మారలేదు.

### కరెన్సీ బలహీనత

ఈ క్రమంలోనే 52 వారాల గరిష్టాన్ని నమోదు చేసిన స్టాక్‌ల సంఖ్య 99 కాగా, 52 వారాల కనిష్ట స్థాయిని నమోదు చేసిన స్టాక్‌ల సంఖ్య 255గా ఉంది. అప్పర్ సర్క్యూట్‌లో మొత్తం 166 షేర్లు, లోయర్ సర్క్యూట్‌లో 366 షేర్లు ట్రేడయ్యాయి. వ్యవసాయేతర పేరోల్స్ నివేదిక నేపథ్యంలో డాలర్ పుంజుకుంది. దీంతో ప్రాంతీయ కరెన్సీ బలహీనత పెరిగింది. ఈ నేపథ్యంలో డాలర్‌తో పోలిస్తే భారతీయ రూపాయి ఆల్ టైమ్ కనిష్ట స్థాయి 85.9400కి చేరుకుంది.

### టాప్ 5 లాసింగ్ స్టాక్స్

ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటలకు టాప్ గెయినర్లుగా టెక్ మహీంద్రా, టెక్నాలజీస్, విప్రో, ఇన్ఫోసిస్ ఉండగా, టాప్ లూజర్స్ స్టాక్స్‌లలో శ్రీరామ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఉన్నాయి. దీంతో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 2.08 శాతం తగ్గి 54,585.75 వద్ద ముగిసింది. మరోవైపు, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.61 శాతం నష్టాలతో 17,645.55 వద్ద ముగిసింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటలకు టాప్ గెయినర్లుగా, టెక్ మహీంద్రా, టెక్నాలజీస్, విప్రో, ఇన్ఫోసిస్ ఉండగా, టాప్ లూజర్స్ స్టాక్స్‌లలో శ్రీరామ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఉన్నాయి. దీంతో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 2.08 శాతం తగ్గి 54,585.75 వద్ద ముగిసింది. మరోవైపు, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.61 శాతం నష్టాలతో 17,645.55 వద్ద ముగిసింది.

### ఇక రంగాల వారీగా చూస్తే..

రంగాల వారీగా నిఫ్టీ ఐటీ లాభాలలో అగ్రగామిగా 3.44 శాతం పెరిగింది. మీడియా (3.59 శాతం తగ్గింది), రియాల్టీ (2.77 శాతం తగ్గింది), బ్యాంక్ (2.72 శాతం తగ్గింది). హెల్త్‌కేర్ (2.21 శాతం) తగ్గింది. టెక్ స్టాక్‌లు కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, బేరిష్ సెంటిమెంట్‌ను ప్రతిబింబిస్తూ మెటల్స్, ఫైనాన్షియల్స్ ఒత్తిడిలోకి వెళ్లాయి.

### ఒప్పందాలు..

గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ లిమిటెడ్ కంపెనీ అనుబంధ సంస్థ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ద్వారా విదేశీ అనుబంధ సంస్థను విలీనం చేయడం గురించి ఎక్స్ఛేంజీకి తెలియజేసింది. డిష్‌మాన్ కార్బోజెన్ ఎమెసిస్ లిమిటెడ్ తన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థగా ప్రకటించింది. బెంగళూరులో రూ. 700 కోట్ల భూ సేకరణ తర్వాత పురవంకర షేర్లు 2.22% పడిపోయాయి. పురవంకర షేర్లు 2.22% తగ్గి రూ. 362.70 వద్ద ట్రేడయ్యాయి. రూ. 700 కోట్ల ఆదాయంతో గృహనిర్మాణ ప్రాజెక్టును నిర్మించేందుకు కంపెనీ బెంగళూరులో 3.63 ఎకరాల

# దేశ నిర్మాణమే మా ప్రధాన లక్ష్యం

# చైర్మన్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ

ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్‌ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా 'ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు..? ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు? ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలువురు సెలబ్రిటీలు సైతం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ చైర్మన్ చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. దేశ నిర్మాణమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం అని పేర్కొంది. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా భారతదేశ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచిందని వివరించింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసాధారణమైన కృషి అవసరమని పేర్కొంది. ఈ విస్తృత లక్ష్యాన్నే చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయని వివరణ ఇచ్చింది.

### వారానికి 90 గంటలు పని చేయాలన్న ఎల్‌అండ్‌టీ చైర్మన్



ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్‌ఎన్ సుబ్రహ్మణ్యన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఎల్‌అండ్‌టీ ఉద్యోగులతో ఇటీవల ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. 'ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంత సేపు ఇంట్లో కూర్చుంటావు? ఎంతసేపు నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు? ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగని సుబ్రహ్మణ్యన్.. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఒక చైనా వ్యక్తితో మాట్లాడానని, చైనా కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు కాబట్టి కొన్ని రోజుల్లో అమెరికాను చైనా దాటేస్తుందని ఆ వ్యక్తి చెప్పినట్టు సుబ్రహ్మణ్యన్ చెప్పుకొచ్చారు. 'మీరు కూడా ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయాల్సిందే. ముందుకొచ్చి పని చేయండి' అని ఆయన పిలుపునిచ్చారు. ఆయనపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలను చిన్నచూపు చూసేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు.

# స్మాల్-మిడ్ క్యాప్‌దే హవా



### స్టాక్ మార్కెట్లలో మ్యూచువల్ ఫండ్ స్కీముల జోరు

### డిసెంబర్‌లో 14 శాతం ఎగిసిన పెట్టుబడులు

మ్యూచువల్ ఫండ్స్ ఈక్విటీ స్కీముల్లోకి వచ్చే పెట్టుబడులు గత నెలలో 14 శాతానికిపైగా పెరిగాయి. డిసెంబర్‌లో రూ. 41,156 కోట్లకు చేరాయి. నిజానికి దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకుల్లో ఉన్నప్పటికీ ఈ స్థాయిలో పెట్టుబడులు రావడం విశేషం. కాగా, చిన్న, మధ్యతరహా మ్యూచువల్ ఫండ్స్ స్కీములు మదుపరులను ఆకట్టుకుంటూనే ఉన్నాయి. దీంతో గత నెల రికార్డు స్థాయికి పెట్టుబడులు వెళ్లాయని భారతీయ మ్యూచువల్ ఫండ్స్ సంఘం (యాంఫీ) తాజాగా తెలియజేసింది.

### సిప్‌లు ఆకర్షణీయం

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) మదుపరులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. నవంబర్‌తో చూస్తే డిసెంబర్‌లో సిప్‌ల్లోకి పెట్టుబడులు రూ.25,320 కోట్ల నుంచి రూ.26,459 కోట్లకు పెరిగాయి. దీంతో సిప్ నిర్వహణలోని మొత్తం ఆస్తులు రూ.13.63 లక్షల కోట్లకు చేరాయి. మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల్లో ఇది దాదాపు ఐదో వంతుకు సమానం. గత ఏడాది డిసెంబర్ 31నాటికి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తులు రూ.66.93 లక్షల కోట్లుగా ఉన్నాయి. అయితే నవంబర్ 30న ఇవి రూ.68.08 లక్షల కోట్లుగా ఉన్నాయి. కాగా, స్టాక్ మార్కెట్లు దిద్దుబాటు దిశగా వెళ్లడంతో డెట్ స్కీముల నుంచి రూ.1.27 లక్షల కోట్ల పెట్టుబడులను మదుపరులు వెనక్కి తీసుకున్నారని, దానివల్లే ఈ తగ్గుదల అని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని తెలిపారు.

### మున్ముందు అనిశ్చిత పరిస్థితులే..

సమీప భవిష్యత్తులో దేశీయ స్టాక్ మార్కెట్లలో అనిశ్చిత పరిస్థితుల్నే చూస్తామని యాంఫీ సీఈవో వెంకట్ చలసాని చెప్తున్నారు. అమెరికాలో అధ్యక్షుడిగా ట్రంప్ వస్తుండటం.. మార్కెట్లను ఎక్కువగా ప్రభావితం చేయవచ్చని అంటున్నారు. ప్రతీకార సుంకాలు ప్రభావం చూపవచ్చన్న అంచనాలున్నాయి. అయితే దేశీయ మదుపరులు స్టాక్స్‌లో పెట్టుబడులపట్ల ఆసక్తితోనే ఉంటారన్న అభిప్రాయాన్ని చలసాని వ్యక్తం చేశారు. సిప్ పెట్టుబడులు.. స్టాక్ మార్కెట్లపై ఇన్వెస్టర్లకున్న ఉన్న విశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు.

### 33 న్యూ ఫండ్ ఆఫర్స్

అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు డిసెంబర్‌లో మొత్తం 33 కొత్త ఫండ్లను ఆఫర్ చేశాయి. వీటి ద్వారా రూ.13,643 కోట్లకుపైగా నిధులను సమీకరించాయి. అంతకుముందు నెల నవంబర్‌లో 18 స్కీములు పరిచయమవగా, రూ.4,000 కోట్ల నిధుల సమీకరణే జరిగినట్టు యాంఫీ తాజాగా ప్రకటించింది. ఇదిలావుంటే థీమ్యాటిక్ కేటగిరీ డిసెంబర్‌లో రూ.15,331 కోట్ల పెట్టుబడుల్ని అందుకున్నది. నవంబర్‌లో ఇది రూ.7,658 కోట్లే. ఇక మిడ్‌క్యాప్ కేటగిరీలోకి రూ.5,093 కోట్లు, స్మాల్‌క్యాప్ రూ.4,667 కోట్లను పొందాయి. బడా స్కీముల్లోకి రూ.2,010 కోట్లు వచ్చాయి. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌ల్లోకి రూ.640 కోట్ల పెట్టుబడులు వచ్చాయని యాంఫీ సీఈవో చలసాని చెప్పారు.

# మార్కెట్లకు బ్లూ-చిప్ దెబ్బ



**అమ్మకాల ఒత్తిడిలో బడా షేర్లు**
**సెన్సెక్స్ 528, నిఫ్టీ 162 పాయింట్లు డౌన్**

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలకు లోనయ్యాయి. మార్కెట్ హెవీ వెయిట్ షేట్లరైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను ప్రకటించే ఆర్థిక ఫలితాలు ఎలా? ఉంటాయోనన్న భయాందోళనలు మదుపరులను వెంటాడాయి. అలాగే తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. పేలవమైన చైనా రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, అమెరికా బాండ్లలో అమ్మకాల ఒత్తిడి కూడా నష్టపర్చాయి. ఈ క్రమంలోనే అంతా పెట్టుబడుల ఉపసంహరణకు తెగబడ్డారు. దీంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 528.28 పాయింట్లు లేదా 0.68 శాతం పడిపోయి 78వేల మార్కుకు దిగువన 77,620.21 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 605.57 పాయింట్లు క్షీణించడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 162.45 పాయింట్లు లేదా 0.69 శాతం దిగజారి 23,526.50 వద్ద ముగిసింది.

### సెన్సెక్స్ 30 షేర్లలో..

టాటా స్టీల్, జొమాటో, ఎల్‌అండ్‌టీ, టాటా మోటర్స్, అదానీ పోర్ట్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్టీపీసీ షేర్లు ప్రధానంగా సెన్సెక్స్‌లో నష్టాలను చవిచూశాయి. దేశీయ ఐటీ రంగ దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అక్టోబర్-డిసెంబర్‌కుగాను 11.95 శాతం వృద్ధితో రూ.12,380 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అయితే మార్కెట్ ముగిశాక ఈ ఆర్థిక ఫలితాలు వెలువడ్డాయి. దీంతో ఆ షేర్‌పై ఈ ప్రభావం లేకుండాపోయింది. ఇక నెస్లే, హిందుస్థాన్ యునీలివర్, ఎంఅండ్‌ఎం, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు పుంజుకున్నాయి.

### రంగాలవారీగా..

రియల్టీ 2.90 శాతం, చమురు-గ్యాస్ 2.19 శాతం, ఎనర్జీ 1.83 శాతం, పవర్ 1.68 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.54 శాతం, బీఎస్ఈ ఫోకస్డ్ ఐటీ 1.14 శాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 1.17 శాతం, మిడ్‌క్యాప్ 0.96 శాతం మేరకు పడిపోయాయి. కాగా, ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లూ మిశ్రమంగా ట్రేడ్ అవుతున్నాయి.

# ఇండియాఏఐతో మైక్రోసాఫ్ట్ జట్టు





### 2026 నాటికి 5 లక్షల మందికి 'ఏఐ'లో శిక్షణ

### మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ చందోక్ వెల్లడి

కేంద్ర ప్రభుత్వానికి చెందిన కృత్రిమ మేధ (ఏఐ) ప్రాజెక్ట్ 'ఇండియాఏఐ'తో అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చేతులు కలిపింది. ఈ భాగస్వామ్యంలో దేశంలోని విద్యార్థులు, టీచర్లు, డెవలపర్లు, ప్ర?భుత్వ అధికారులు, మహిళా పారిశ్రామికవేత్తలు సహా మొత్తం 5 లక్షల మందికి ఏఐలో శిక్షణ ఇవ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ వెల్లడించారు. "భారత్‌లో 20 లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు గత ఏడాదే ప్రకటించాం. ఇప్పటికే 24 లక్షల మందికి శిక్షణ అందించాం. వచ్చే ఐదేళ్లలో కోటి మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తాజాగా ప్రకటించడం జరిగింది. ఇందుకోసం ఇండియాఏఐ మిషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకు న్నాం. ఈ ఒప్పందంలో భాగంగా 5 లక్షల మందికి శిక్షణ అందిస్తాం" అని చందోక్ పేర్కొన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా మైక్రోసాఫ్ట్ 10 రాష్ట్రాలోని 20 నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్ఎస్‌టీఐ), ఎన్ఐఈఎల్ఐటీ సెంటర్లలో ఏఐ ప్రొడక్టివిటీ ల్యాబ్స్‌ను మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రాల ద్వారా 20,000 మంది టీచర్లకు ఏఐ ఫండమెంటల్స్ శిక్షణ ఇవ్వడంతోపాటు 200 ఐటీఐల్లో 1,00,000 మంది విద్యార్థులకు ఫౌండేషన్ ఏఐ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు కంపెనీ వెల్లడించింది. అలాగే, 'ఏఐ క్యాటలిస్ట్స్' పేరుతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు చందోక్ వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా గ్రామాల్లో ఏఐ ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోపాటు లక్ష మంది ఏఐ డెవలపర్లకు మద్దతివ్వనున్నారు. సమాజానికి పనికివచ్చే పరిష్కారాల అభివృద్ధిని ప్రోత్సహించనున్నారు.

### సరికొత్త ఆవిష్కరణల కోసంకృషి చేయాలి: నాదెళ్ల

కృత్రిమ మేధలో సరికొత్త ఆవిష్కరణల కోసం భారత్ కృషి చేయాలని, సొంత ఫౌండేషనల్ మోడల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని మైక్రోసాఫ్ట్ సారథి సత్య నాదెళ్ల అన్నారు. కానీ, ఇందుకు పెట్టుబడుల లేమి ప్రధాన అవరోధమని, ఒక్క పురోగతి మొత్తం స్థితిగతులను మార్చగలదన్నారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఏఐ టూర్ రెండో రోజు (బుధవారం) నాదెళ్ల ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ భాషలు, ఏఐ ద్వారా పారిశ్రామిక పరివర్తనం అంశాల్లో భారత్ గొప్పగా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం భారత్ గూగుల్, ఓపెన్ ఏఐ తదితర సంస్థలు అభివృద్ధి చేసిన ఏఐ ఇంజన్లు లేదా ఫౌండేషనల్ మోడల్స్‌ను ఉపయోగించుకుంటోంది.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com